ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 2, మార్చి 2024



తూర్పుగంగవరంలోని తిప్పబీడు భూమిలో మేత మేస్తున్న గేదెలు

'ఉమ్మడి'కి ఎసరు

- తూర్పుగంగవరం గ్రామ తిప్పబీడు భూములపై వైసీపీ నేతల కన్ను
- పశువుల మేత కోసం 191 ఎకరాలకు గతంలో గ్రామంలోని ఏడుగురి పేర్లతో పట్టాలు
- సాగులేని బీడు భూమికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు సృష్టించి ఎఫ్‌పీవోఎల్‌ఆర్‌లో నమోదు
- పట్టాదారుల ప్రమేయం లేకుండా మ్యుటేషన్‌కు సిఫార్సు చేసిన తహసీల్దార్
- ఆస్తి విలువ కోట్లపై మాటే ..

ఊరు ఉమ్మడి బీడును అప్పనంగా కొట్టేసేందుకు కొందరు వైసీపీ వర్గీయులు సిద్ధమైపోయారు. అధికారం చేతిలో ఉంది కదా అన్న ధీమాతో ఏకంగా రూ.కోట్ల విలువైన భూమికి ఎసరుపెట్టారు. భూముల ధరలు గణనీయంగా పెరగటంతో ఇదే అదనుగా కాజేసేందుకు పన్నాగం పన్నారు. భూముల రక్షణ కోసం ఉన్న పట్టాదారుల కుటుంబీకులు కొందరు, సంబంధం లేని వ్యక్తులు మరికొందరు తమకున్న అధికార బలంతోపాటు భారీ స్థాయిలో ముడుపులు ముట్టచెప్పి తమ పేర్లపై ఆన్‌లైన్ చేయించుకునేందుకు చూస్తున్నారు. వారికి అధికారులు కూడా సంపూర్ణంగా సహకరిస్తున్నారు. 130మంది వారసులు ఉండగా కేవలం ఐదుగురు వైసీపీ నేతల పేర్లు ఎఫ్‌పీవోఎల్‌ఆర్‌లో చేర్చారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందితో సంబంధం లేకుండా మ్యుటేషన్ ప్రక్రియను చేపట్టడం గమనార్హం.



ఎఫ్‌పీవోఎల్ఆర్‌లో తహసీల్దార్ ఐదు పేర్లతో నమోదు చేసిన జాబితా

తాళ్లూరు, మార్చి 1 : పశువుల మేత కోసం దశాబ్దాల క్రితం గ్రామానికి ఉమ్మడిగా కేటాయించిన భూమిని కాజేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే భూమిని వారసుల ముసుగులో కొట్టేసేందుకు చూస్తున్నారు. బీడు భూమి కావడంతోపాటు ఎవరూ సాగులో లేకపోయినా సరే ఉన్నట్లు చూపిస్తూ ఆన్‌లైన్ చేయించుకొనేందుకు అడ్డదారులు తొకుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగంగవరం గ్రామంలో పశువుల అవసరాల కోసం నాగంబొట్లపాలెం సర్వేనంబరు 229లో 190.50 ఎకరాల భూమిని వెంకటగిరి రాజుల కాలంలో గ్రామ ఉమ్మడి భూమిగా కేటాయించారు. అది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు గ్రామంలోని ఏడుగురు పెద్దలు జాష్టి హనుమయ్య, పట్టాభి రంగయ్య, గూడా బ్రహ్మారెడ్డి, యత్తపు చినయల్లారెడ్డి, యత్తపు పెద్దక్క, గూడా లక్ష్మమ్మ, గుజ్జుల పెదనాసరెడ్డిల పేరిట పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూమికి గట్టి భద్రత కల్పించి వారి పేర్లను రెవెన్యూ ఎఫ్ఎల్ఆర్‌లో కూడా నమోదు చేశారు. ప్రస్తుతం ఆ భూమిలో కొంతభాగం చెరువు, కొంత భాగం సాగర్ కాలువల ఏర్పాటు జరిగింది. మిగిలిన భూమి గుంతలుగా రాళ్లురప్పలతో నిండి, ఏపుగా గడ్డి, పలు రకాల మొక్కలు పెరిగి ఉన్నాయి. గ్రామస్థులు దశాబ్దాలకాలంగా ఆ భూమిలోకి పశువులను తోలి మేపుకుంటూ ఉన్నారు. ఆ భూమిలో ఒక్క ఎకరా కూడా సాగులో లేదు.

ఐదుగురి పేరుతో 72 ఎకరాలు!

ఏడుగురి కుటుంబాల్లో రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు ముందుకొచ్చి ఆ భూమికి తమ పెద్దల పేర్లతో పట్టాలు ఉన్నందున తమ పేర్లపై ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సచివాలయంలో మ్యుటేషన్‌కు పెట్టుకున్నారు. గతంలోని తహసీల్దార్లు ఆ భూమి ఉమ్మడి బీడుగా ఉందని తెలిసి మిన్నకుండిపోయారు. ఆ ఐదుగురు మాత్రం అధికారం అండతో ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌పై ఒత్తిడి తేవడంతోపాటు, రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెప్పి ఎఫ్‌పీవోఎల్‌ఆర్ రికార్డుల్లో 72 ఎకరాలను తమ పేర్లతో నమోదు చేయించుకున్నారు. యత్తపు లింగమ్మ తొమ్మిది ఎకరాలు, యత్తపు రంగమ్మ తొమ్మిది ఎకరాలు, యత్తపు అల్లూరిరెడ్డి 13.50 ఎకరాలు, యత్తపు యల్లారెడ్డి 13.50 ఎకరాలు, కాసా సామ్రాజ్యం 27 ఎకరాలు మ్యుటేషన్ కోసం ఎఫ్‌పీవోఎల్‌ఆర్ నమోదు చేయించారు.

మిగతా వారికి చెప్పనే లేదు

ఆర్‌వోఆర్ యాక్ట్ ప్రకారం ఏడుగురు పట్టాహక్కుదారులను పిలవకుండా కొందరికి లబ్ధి చేకూర్చేలా రెవెన్యూ రికార్డుల్లో కేవలం ఐదుగురి పేర్లు నమోదు చేయడంపై మిగిలిన పట్టాదారులు మండిపడుతున్నారు. రెవెన్యూ అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. అన్యాయంగా ఎఫ్‌పీవోఎల్‌ఆర్‌లో ఐదుగురి పేర్లు నమోదు చేయించారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఏడు కుటుంబాలకు దాదాపు 130మంది సంతానం ఉండగా తహసీల్దార్ ఎవరినీ సంప్రదించకుండా ఐదుగురే సాగులో ఉన్నట్లు చూపి భూమి పంచినట్లు రికార్డుల్లో నమోదు చేయడంతో గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. అధికార పార్టీ నేతలు రాజకీయ పలుకుబడితో గ్రామ ఉమ్మడి భూమిని కాజేసేందుకు యత్నాలు చేస్తూ తప్పుడు రికార్డులు సృష్టించడంపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. భూమి భద్రత కోసం పట్టా హక్కు గల ఏడుగురు కుటుంబాలను కాదని తమ ఇష్టానుసారం ఐదుగురి పేర్లను ఎఫ్‌పీవోఎల్ఆర్ చేర్చడం తీవ్ర చర్చనీయాంశమైంది.

భూమిలో నుంచి హైవే రోడ్డు..

ఆ భూమి గుండా నేషనల్ హైవే రోడ్డు పడటంతో ధరలు పెరిగాయి. ఎకరా సరాసరిన రూ.5లక్షల మేర ఉందని, గ్రామ ఉమ్మడి భూమి విలువ కోట్లల్లో ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. గత కొంతకాలంగా గ్రామస్థులు ఆ భూమి అన్యాక్రాంత కాకుండా చూడాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలు మార్లు అధికారులను కలిసి వారి దృష్టికి కూడా తీసుకెళ్లారు. కానీ అధికార యంత్రాంగం మాత్రం ఎవరి పేరున పట్టాలు ఇవ్వడం కుదరదని చెబుతూ వచ్చింది. అయితే ఇటీవల బదిలీపై వెళ్లే ముందు తహసీల్దార్ ఎఫ్‌పీవోఎల్‌ఆర్‌లో ఐదుగురు పేర్లను చేర్చారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తిప్పబీడు భూమిని పరిశీలించాలని, సాగులో లేని భూమిని సాగుగా చూపుతూ తప్పుగా నమోదు చేసిన పేర్లను రద్దుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పశువుల మేత కోసం కేటాయించిన గ్రామ ఉమ్మడి భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి బీడును కాజేసేందుకు యత్నం



మా గ్రామంలో సర్వే నంబర్ 229లోని 190.50 ఎకరాల భూమిని గ్రామస్థులు పశువుల మేత కోసం వినియోగించుకొంటున్నారు. దశాబ్దాల క్రితం ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా కేవలం పశువుల మేత కోసం గ్రామంలోని ఏడుగురికి పట్టాలు కూడా పంపిణీ చేశారు. దీనిపై అధికార పార్టీ నేతల కన్నుపడింది. అందులో రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు అధికారులతో లాలూచీపడి ఎఫ్‌పీవోఎల్‌ఆర్ తప్పుడు విధంగా పేర్లు నమోదు చేయించుకొని ఆన్‌లైన్ కోసం యత్నిస్తున్నారు.

\- వల్లభనేని సుబ్బయ్య, తూర్పుగంగవరం

విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం

తూర్పుగంగవరంలో సర్వేనంబర్లు 229లోని 190.50 ఎకరాల్లో 72ఎకరాల భూమి మ్యూటేషన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. కొందరు గ్రామస్థులు ఈ విషయమై లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారిస్తాం. క్షేత్రస్థాయిలో ఆ భూమిని పరిశీలించి, విచారణ చేయించి అవసరమైన మేర చర్యలు తీసుకుంటాం.

\- షేక్ మహమ్మద్ హుస్సేన్, తాళ్లూరు తహసీల్దార్



పునాదుల్లోనే నిలిచిన పక్కాగృహాలు

గూడు.. గోడు

- గిరిజనులకు పక్కాగృహాల నిర్మాణానికి స్వచ్ఛంద సంస్థల సహకారం
- అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులు
- 160 ఇళ్ల నిర్మాణం ప్రశ్నార్థకం
- అధికారుల తీరుపై చెంచుల ఆగ్రహం

పెద్దదోర్నాల, మార్చి 1 : అటవీశాఖ తీరుతో చెంచుగిరిజనులకు గూడు కరువవుతోంది. అనాదిగా అడవిని నమ్ముకున్న తమకు కాసింత నీడను ఏర్పాటుచేస్తుంటే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పూరిపాకల్లో దుర్భరంగా జీవిస్తున్న చెంచులకు 160 పక్కా గృహాలు నిర్మించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. అది కూడా అటవీ శాఖాధికారులు, ఐటీడీఏ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ అనుమతులు ఉన్న స్థలాలకు పట్టాలిచ్చిన అనంతరం ఇంటికి కావాల్సిన సిమెంటు, ఇసుక, ఇటుకలు, ఇనుము ఇతర సామగ్రిని లబ్ధిదారులకు తరలించారు. నిర్మాణాలను ప్రారంభించి, పునాదుల స్థాయికి వచ్చాయి. ఈక్రమంలో అటవీశాఖ ఉన్నతాధికారి ఆదేశాలతో స్థానిక అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో చెంచుగిరిజనులు అయోమయానికి గురయ్యారు. కొందరు గిరిజన పెద్దలు మార్కాపురం డీఎఫ్‌వోను కలిసి చర్చించగా కోర్ ఏరియాలో భవనాలు నిర్మించకూడదని, రేకులు ఏర్పాటు చేసుకోవాలని సెలవిచ్చారు. దీంతో చెంచులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ కూడా డీఎఫ్‌వో చెప్పిన మాటే చెప్పారు. దీంతో తమ బాధ ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదని చెంచులు వాపోతున్నారు. తొలినాళ్లలో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అదే అధికారి ఉన్నారని, అప్పుడే అభ్యంతరం చెప్పాల్సి ఉందన్నారు. అందరూ ఒప్పుకున్నారు కదా అని ఉన్న ఇంటిని కాస్త కూల్చుకున్నామని పలువురు గిరిజనులు వాపోతున్నారు.



ఇళ్ల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరం చెప్తున్న ప్రాంతంలో నిర్మించిన సచివాలయ భవనం

చట్టం అధికారులకు చుట్టమైందా!

తరతరాలుగా అడవిలోనే జీవిస్తున్న చెంచు గిరిజనులకు ఉన్న కాస్తంత స్థలానికి పట్టాలివ్వడం గగనంగా మారింది. ఆ స్థలంలోనే ఎవరో దాతృత్వంతో ఇళ్లు కడతామంటే కోర్ ఏరియా, బఫర్ ఏరియా అంటూ సవాలక్ష ఆంక్షలు చూపిస్తూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. ఇటీవల ఆ సమీపంలోనే రెండంతస్తుల సచివాలయ భవనాన్ని నిర్మించారు. అటవీశాఖ వారు కమ్యూనిటీ హాలు కట్టారు. పెద్ద చర్చి నిర్మించారు. ఎప్పుడో 30ఏళ్ల క్రితం ఇందిరమ్మ ఇళ్లు శ్లాబులతోనే నిర్మించారు. ఇష్టకామేశ్వరి అమ్మవారి దేవాలయం కూడా పూర్తి కోర్ ఏరియాలో ఉంది. పెద్దచెట్లు నరికి రోడ్డు చదును చేసి అటవీ శాఖ ఆధ్వర్యంలోనే డబ్బుల కోసం జీపులు తిప్పుతున్నారు. అక్కడ లేని చట్టం తాము ఇళ్లను శ్లాబుతో నిర్మిస్తే వస్తుందా.. అని చెంచులైన మాజీ ఎంపీటీసీ కుడుముల పోతన్న, సర్పంచి వెంకటయ్య, గిరిజనులు హనుమయ్య, వీరన్న తదితరులు ఆక్షేపిస్తున్నారు. పెద్ద చామకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.9లక్షలు మంజూరు చేసిందని, అయితే అటవీ శాఖ అభ్యంతరంతో ఆ నిధులు నిలిచిపోయాయని ఆరోపించారు. 'ఏదన్నా అడిగితే బయటకు రండి మీకు సహకరిస్తాం.. అంటారు. మైదాన ప్రాంతాల్లో కనీసం గుక్కెడు నీళ్లు ఇవ్వడం లేదు. అడవిలో 60 అడుగులకే నీళ్లు వస్తున్నాయి. మమ్మల్ని బతకనివ్వండి' అంటూ చెంచు గిరిజనులు వాపోతున్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఉన్న ఇంటిని పడగొట్టుకొని పాకలో జీవిస్తున్న హనుమయ్య

కొనసాగుతున్న కసరత్తు

- లోకేష్ పర్యటన వాయిదా
- బాబుతో మాగుంట భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మిగిలిన అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాత పర్యటించాలన్న ఉద్దేశంతో లోకేష్ శంఖారావాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఆదివారం నుంచి జిల్లాలో ప్రారంభం కావాల్సిన లోకేష్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేసినట్లు అధికారికంగా సమాచారమిచ్చారు. జిల్లాతోపాటు ఆయన పర్యటించనున్న ఇతర జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక ఇంకా ఖరారుకాని విషయం తెలిసిందే. ఆదివారం నుంచి లోకేష్ పర్యటిస్తే మూడు రోజుల్లో ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో సభలు జరగాల్సి ఉంది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలో చేరిక తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఒంగోలు లోక్‌సభలో పర్యటించేటప్పుడు మాగుంటతోపాటు ఆయన కుమారుడు కూడా ఉంటే మంచిదన్న అభిప్రాయానికి అధిష్ఠానం వచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు మాగుంట కూడా సమాచారమిచ్చారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లో చంద్రబాబును మాగుంట కలిసినట్లు తెలిసింది. ఆయన చెన్నై నుంచి హైదరాబాద్‌కు చేరి బాబును కలిసినట్లు సమాచారం. ప్రధానంగా మాగుంట, ఆయన అనుచరులు పార్టీలో చేరే తేదీపై మాట్లాడినట్లు తెలిసింది. అధినేత చంద్రబాబు శనివారం నుంచి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నందున అనుకూలమైన తేదీన ఆయన సమక్షంలో మాగుంటతోపాటు కుమారుడు రాఘవరెడ్డి, ముఖ్య అనుచరులు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 6వ తేదీ లేక మరో రోజు మాగుంట చేరేందుకు చంద్రబాబు కార్యక్రమం ఖరారు చేయనున్నట్లు సమాచారం. అలాగే పశ్చిమప్రాంతంలోని ఒక అసెంబ్లీ స్థానం నుంచి మాగుంటను రంగంలో దించే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. దీనికితోడు జనసేన పోటీచేసే స్థానాలు, అలాగే అభ్యర్థుల ఎంపిక కూడా జరగాల్సి ఉంది. ఇదే సమయంలో బీజేపీతో పొత్తు విషయం కొలిక్కిరాలేదు. అన్ని అంశాలపై తుదినిర్ణయం జరిగిన తర్వాత లోకేష్ శంఖారావం సభలను నిర్వహిస్తే బాగుంటుందన్న ఆలోచనకు వచ్చారు. ఆ మేరకు జిల్లాలో లోకేష్ పర్యటన ఎప్పుడు ఉండేది మరో రెండురోజుల తర్వాత తెలియజేస్తామని అధిష్ఠానం జిల్లా నాయకులకు సమాచారమిచ్చింది.



పనిచేయని సర్వర్!

- రేషన్ వాహనాల వద్ద గంటల తరబడి ఎదురుచూపులు
- ఈనెలలోనూ కందిపప్పు అరకొరే

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 1 : జిల్లాలో రేషన్ పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైనా కార్డుదారులకు అందాల్సిన కందిపప్పు మాత్రం కనిపించ లేదు. ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి అరకొరగానే సరఫరా చేస్తోంది. జిల్లాకు 590 టన్నుల రేషన్ కందిపప్పు అవసరం కాగా కేవలం 15 టన్నులు మాత్రమే అందుబాటులో ఉండటంతో దాని పంపిణీని నిలిపివేశారు. బియ్యం, పంచదారను మాత్రమే అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 6,70,571 కార్డులు ఉండగా ఒక్కో కార్డుకు కిలో చొప్పున కందిపప్పు, ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, అర కిలో పంచదారను అందజేయాల్సి ఉంది. అయితే కందిపప్పు, గోధుమపిండి అవసరమైన మేర అందుబాటులో లేదు. జిల్లాకేంద్రమైన ఒంగోలుతోపాటు పలు ప్రాంతాల్లో సరుకుల పంపిణీకి సర్వర్ ఆటంకంగా మారింది. సర్వర్ పనిచేయక కార్డుదారులు గంటల తరబడి మొబైల్ వాహనాల వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయానికి 22,787 (3.39శాతం) కార్డుదారులకు మాత్రమే సరుకులు అందాయి. పంపిణీలో రాష్ట్రంలో మన జిల్లా 18వ స్థానంలో ఉందంటే సర్వర్ ఏవిధంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు.



విద్యార్థులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

పేదల ఉన్నత విద్యకు భరోసా

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : పేద విద్యార్థుల ఉన్నత విద్యకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తున్నదని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పథకం కింద 47,422 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు, విద్యార్థుల జాయింట్ బ్యాంకు ఖాతాలకు రూ.36.44 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం సీఎం బటన్ నొక్కి నిధులను జమచేశారు. ఈ సందర్భంగా ప్రకాశం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యాదీవెన ద్వారా పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాల్లో జమచేస్తుందని తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి కలెక్టర్ విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, డీటీడబ్ల్యూవో జగన్నాథరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజనీదేవి, బి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమయం మించిపోతుండటంతో పరుగెడుతున్న విద్యార్థి

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మొదటి రోజు 21,387 మంది హాజరు



ఒంగోలులోని ఓ కేంద్రానికి పరీక్ష రాసేందుకు పెద్దఎత్తున వచ్చిన విద్యార్థులు

ఒంగోలు (విద్య), మార్చి 1 : జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్ట్‌యియర్ ద్వితీయ భాషా పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8.30 నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. అన్ని కేంద్రాలను నోఫోన్ జోన్లుగా ప్రకటించారు. దీంతో పరీక్షల నిర్వహణాధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది సెల్‌ఫోన్లను కేంద్రాలకు తీసుకెళ్లనివ్వలేదు. అన్నిచోట్లా పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు అమర్చి గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులతో ప్రత్యేకంగా వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించడంతోపాటు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జెరాక్స్, కంప్యూటర్ సెంటర్లను మూసివేయించారు.

పరీక్షకు 1,447 మంది గైర్హాజరు

మొదటిరోజు పరీక్షకు 21,387 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 20,295 మందికి గాను 19,233 మంది పరీక్ష రాశారు. 1,062 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు 2,539 మందికిగాను 2,154 మంది హాజరయ్యారు. మొత్తం 22,834 మందిలో 1,447 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. స్క్వాడ్ అధికారులు, ఆర్ఐవో, డీఈసీ సభ్యులు 58 పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

ఆలయాల్లో పూజలు

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. లాయర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బాబా పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజల అనంతరం పరీక్షకు హాజరయ్యారు. నగరంలోని ఇతర ఆలయాల్లో కూడా విద్యార్థులు తమ ఇష్టదైవాలకు ప్రార్థనలు చేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఒంగోలు నారాయణ జూనియర్ కళాశాలలోని కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్ని గదులతోపాటు సీసీటీవీ కంట్రోల్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావు ఉన్నారు.



ఓ కేంద్రం వద్ద తమకు కేటాయించిన గదులను చూసుకుంటున్న విద్యార్థినులు



ఒంగోలులో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆసరా చెక్కులను పంపిణీ చేసిన బాలినేని

కొత్తపట్నం, మార్చి 1: ప్రభుత్వం అమ లు చేస్తున్న ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మహిళలకు పంపిణీ చేశారు. శుక్రవారం కొత్తపట్నంమండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. జగన్మోహనరెడ్డి ఇచ్చిన మేరకు డ్వాక్రా రుణామాఫీ చేస్తున్నారని చెప్పారు. అంతేగాకుండా కొత్తపట్నం బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన నిర్మాణ పనులను సొంత నిధులతో పూర్తి చేయిస్తానని తెలిపారు. రూ. 2.70 కోట్లతో మార్కెట్ యార్డు నుంచి పల్లెపాలెం వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.

చీరలు..రిజిస్ట్రేషన్ పత్రాలు అని చెప్పటంతో..

ఆసరా కింద రుణమాఫీ చెక్కులు ఇచ్చే కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు చీరెల పంపిణీ, జగన్న లే అవుట్లలో రిజిస్ట్రేషన్ జరిగిన ఇళ్ల పట్టాల పత్రాలు పంపిణీ చేస్తామని చెప్పటంతో మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి హాజరుకాలేదు. డ్వాకా మహిళల కోసం బాలినేని సొంత ఖర్చుతో వేల చీరలు తెప్పించి పంపిణీ చేసేందుకు మండల కార్యాలయం ఆవరణలో ఉన్న వైకేపీ కార్యాలయంలో ఉంచారు. గ్రామాల వారీగా వీటిని పంపి మహిళలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నగరా మోగక ముందే ఉచిత పంపిణీల కార్యక్రమానికి తెరలేపారు.

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

చీమకుర్తి, మార్చి1 : ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు లాంటి వారు వలంటీర్లు అని మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం చీమకుర్తి మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు హాజరైన మంత్రి నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావులు హాజరై వలంటీర్లను ఘనంగా సత్కరించారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. అనంతరం జగనన్నకాలనీల్లో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, దాసరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



పశువైద్య సహాయకులతో కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1: జిల్లాలో పశుసంవర్థకశాఖ ద్వారా కొత్తగా పశువైద్య సహాయకులుగా ఎంపికైన ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 177 పశువైద్య సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులై మెరిట్ ఆధారంగా ఎంపికైన 174 మందికి శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగ నియామక పత్రాలను స్థానిక కలెక్టరేట్‌లో అందజేశారు. ప్రకాశం జిల్లాకు 81, బాపట్లకు 74 మంది, నెల్లూరు జిల్లాకు 19 మందిని కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పశువుల గణాంకాలు సేకరించి రైతులకు అన్ని రకాల సేవలను అందించాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి తదితరులు ఉన్నారు.

ఓట్ల దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

ఓట్ల చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన క్లెయిమ్స్‌లో వారం రోజులు దాటినవి 6200 ఉన్నాయన్నారు. అంతకు ముందు ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికలలో సరైన ఆధారాలు లేని డబ్బు పట్టుబడితే వాటిని అప్పటికప్పుడే సేఫ్ కస్టడీ డిపాజిట్ చేసేలా అన్ని బ్యాంకుల వివరాలను ఈఎస్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలను మరోసారి తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఫొటో గుర్తింపు కార్డులు త్వరగా పంపిణీ, ఎన్నికల సమయంలో సమగ్ర పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కంట్రోలు రూము ఏర్పాటు, జిల్లా నోడల్ ఆఫీసర్ల నియామకం తదితర అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

సంతనూతలపాడు, మార్చి1: పచ్చిరొట్ట ఎరువులు, తెగుళ్ల నివారణపై మండల ఏవో పావని అవగాహన కల్పించారు. మండలంలోని పి.తక్కెళ్లపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి, జీవరసాయన ఎరువుల వాడకం, పచ్చిరొట్ట ఎరువులు, పురుగు తెగుళ్ల యాజమాన్యాల వంటి వాటిపై రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయధికారులు వి.శేషమ్మ, డి.ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.235

సంతనూతలపాడు, మార్చి 1: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు గరిష్ఠ ధర రూ.235 పలికింది. చిలంకూరు నుంచి 54 బేళ్లు రాగా గరిష్ఠ ధర కేజీ రూ.235లు పలుకగా, కనిష్ఠ ధర రూ.230లు పలికినట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

చీమకుర్తి, మార్చి1 : సాధారణ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మండలపరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను శుక్రవారం సీఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ సందరర్భంగా ఆయా గ్రామాల్లో స్థానికులతో మాట్లాడారు.

హింసలేని సమాజం కోసం పోరాటం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హింసలేని సమాజం కోసం, సమాన హక్కుల సాధనకు ఉద్యమించేందుకు విస్తృతంగా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని ఐద్వా నాయకులు పేర్కొన్నారు. ఒంగోలులోని ఐద్వా జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి ఎస్.మాలతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ కార్మిక, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని జిల్లాలోని అన్ని ముఖ్యకేంద్రాల్లో శుక్రవారం నుంచి ఈనెల 15వతేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు, మహిళల జీవితాలను దుర్భరం చేస్తున్నాయన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించిన చట్టాల పరిరక్షణ కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే.నాగూర్‌బీ, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, ఎస్‌కే.బషీర్, బి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



దామచర్ల జనార్దన్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 1: పన్నులు వేసి పీక్కుతినే వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని, ప్రజలు కోరుకున్న పాలన రావాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక 2వ డివిజన్‌లోని కేశవరాజుకుంటలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. గత టీడీపీ హయాంలో అన్ని సామాజిక వర్గాల వారికి సంక్షేమనిధులు కేటయించడంతోపాటు, పలు పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. అయితే అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారని, ఆయన పాలనలో సామాన్యుడు సంతోషంగా జీవించే పరిస్థితి లేదని తెలిపారు. చెత్త పన్ను, ఏటా ఇంటి పన్ను పెంపు, అలాగే ఆర్టీసీ, కరెంటు చార్జీలు ఇష్టారాజ్యంగా పెంచేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ అరాచకాలను బయటపెట్టడంతోపాటు, ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును తిరిగి రాబడతామన్నారు. ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధికి తాను కష్టపడ్డానని చెప్పారు. అలాగే శివారుల కాలనీల్లో తాగునీటి వసతి, రోడ్డు, డ్రైన్‌లు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు సీఎం, ఒంగోలు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని దామచర్ల కోరారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దామచర్లకు ఘన స్వాగతం లభించిది. కార్యక్రమంలో వజీఈ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు మదన్ పాల్గొన్నారు.

చమురు ఉత్పత్తిలో రాష్ట్రానికి వాటా ఇవ్వాలి

సహజ వనరుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ రాజమోహన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజమోహన్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్, చమురు ఉత్పత్తిలో ఆంధ్ర ప్రజల న్యాయమైన వాటా 50శాతం కేటాయించాలని సహజ వనరుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్ సాధన సమితి, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజమోహన్ మాట్లాడుతూ కాకినాడకు 30 కిలోమీటర్ల దూరంలోని సముద్ర గర్భం నుంచి గత జనవరి 7 నుంచి చమురు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తి విలువ కొన్ని రూ.లక్షల కోట్లకు మించి ఉంటుందన్నారు. ఆంధ్ర రాష్ట్రం తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చుతుందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో లభ్యమవుతున్న సహజ వాయువులు మన సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌కు తరలిపోతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను ఆయన ఎండగట్టారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సహజవనరుల దోపిడిని అరికట్టాలని, రాష్ట్రంలో లభించే సహజ వనరులను గృహ అవసరాలకు ఉపయోగించాలని, ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో సహజ వనరులను మనకు దక్కే విధంగా పొందుపర్చాలని, కేంద్ర ప్రభుత్వానికి రాయల్టీ ద్వారా వచ్చే ఆదాయంలో 50శాతం ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించాలని, కొనసీమ ప్రాంతంలో ఆయిల్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, ఎం.హరిప్రసాద్, తాటిపర్తి గోపాల్‌రెడ్డి, బి.సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, అయ్యప్ప రెడ్డి, దాసరి సుందరం, రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌డీ.సర్దార్, పీవీఆర్.చౌదరి, కొంగర నరసింహం, పేరయ్య, ఆవుల సుబ్రహ్మణ్యం, పీవీ.రమణారెడ్డి, గుమ్మల నరసింహారావు, నల్లూరి క్రాంతి, గాలి సంగీతరావు, ఏఎల్.ప్రసాద్, అంకయ్య, పీవీ.సుబ్బారావు, పిన్నిక శ్రీనివాసరావు, వి.రామ్మోహన్‌రెడ్డి, నరేంద్ర, టి.వెంకటస్వామి, ప్రభాకర్, సలార్ పాల్గొన్నారు.

చట్టసవరణతో ఆక్వా రైతులకు ఊరట

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ నేషనల్ డైరెక్టర్ శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు

ఒంగోలు నగరం, మార్చి 1: కోస్టల్ ఆక్వా అథారిటీ చట్టసవరణ ద్వారా ఆక్వా రైతులకు సాగులో ఊరట లభించిందని కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ నేషనల్ డైరెక్టర్ శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన ఆక్వా రైతుల సదస్సు రొయ్యల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శంకరరావు మాట్లాడుతూ 2005లో కోస్టల్ ఆక్వా అథారిటీ చట్టం వల్ల సాగులో ఆక్వా రైతులకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవని, 2013లో ఈ చట్టానికి ప్రభుత్వం పలు సవరణలు చేసిందన్నారు. సవరణలో ఆక్వా రైతులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుని కొత్త నిబంధనలను తీసుకువచ్చారని, ఈ ఏడాది జనవరి నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. ఈక్రమంలో రైతులు తమ రొయ్యల చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం సరళతరం అయ్యిందన్నారు. ఐదు హెక్టార్లలోపు సాగులో ఉన్న చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి అధ్యక్షతన గల సబ్ కమిటీ ఆక్వా అథారిటీకి సిఫార్సు చేయవచ్చన్నారు. ఐదు హెక్టార్ల కంటే ఎక్కువ ఉంటే కలెక్టర్ అధ్యక్షత ఉండే కమిటీ ఆక్వా అథారిటీకి సిఫార్సు చేస్తే సరిపోతుందన్నారు. అసైన్డు భూములు, సొసైటీ భూముల్లో ఉన్న సాగును గతంలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదని, ఇప్పుడు చేసుకోవచ్చని చెప్పారు. గతంలో అనధికారికంగా ఉప్పు నీటి చెరువులను సాగు చేస్తున్న రైతులకు రూ.లక్ష అపరాధరుసుం, మూడేళ్ల జైలు ఉండేదని, ఇప్పుడు ఈ విధానాన్ని ప్రభుత్వం తొలగించిందన్నారు. ఆక్వా రైతుల లైసెన్సులు కొనుగోలు చేస్తే సులభంగా బదలాయించుకోవచ్చన్నారు. ఉప్పు నీటి రొయ్యల పిల్లలు, చేప పిల్లలను అనధికారికంగా ఉత్పత్తి చేసే హేచరీలపై అ పరాధ రుసుం విధించే అవకాశం ఉందన్నారు. కొత్తగా వచ్చిన నిబంధనలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయని, గణనీయమైన ఉత్పత్తులు సాధించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి, రొయ్యల రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంతూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధి

- నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్, నాయకులు

మద్దిపాడు, మార్చి 1: తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గార్లపాడుకాలనీలో బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేదన్నారు. ఐదు సంవత్సర కాలంలో దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, ప్రతిఒక్కరూ దగా పడ్డారని విమర్శించారు. వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, రేషన్ బియ్యం దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని దళితకాలనీలకు సిమెంట్ రోడ్లు వేసిన ఘనత టీడీపీదేనని తెలిపారు. మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ బీఎన్ గెలుపుకోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతృత్వంలో బీఎన్ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల విజయకుమార్, చెరుకూరి వాసుబాబు, ముత్తనపల్లి రామలింగయ్య, రామకృష్ణ, దేవబత్తిన ప్రసాద్, అన్నమనేని సుబ్బారావు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1: పశ్చిమబెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో షాజహాన్ అనే మాఫియా డాన్ మహిళలపై అనేక అకృత్యాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో హిందూ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండపడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో అవినీతి, భూకబ్జాలు, గుండాయిజం, మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నా పట్టించుకోక పోవడం దారుణంగా ఉందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు శెగ్గం శ్రీనివాసరావు, డి.శివాజీ, కె.నాగేశ్వరరావు, తొగంటి శ్రీనివాసరావు, రాయపాటి అజయ్, నారాయణరెడ్డి, కృష్ణవేణి, బాలకోటయ్య, మోజీ, బొద్దులూరి ఆంజనేయులు, విజయరావు, సీతారామయ్య అల్లరి రామయ్య గుర్రం సత్యనారాయణ, కాటా రాధాకృష్ణమూర్తి, పి.దామోదర్, నాయక్, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో విచారణ



విచారణ చేస్తున్న ఉషారాణి

నాగులుప్పలపాడు, మార్చి 1: ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ కార్యదర్శిపై సచివాలయ ఉద్యోగులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శి హరిబాబు సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో పాటు వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరులో అక్రమాలకు పాల్పడినట్లు కలెక్టర్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం డీఎల్‌డీవో ఉషారాణి స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వివాహ ధ్రువీకరణ రికార్డులను పరిశీలించగా కొట్టివేతలు గుర్తించి కార్యదర్శిని వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆమె ఆగ్రహించారు. సహఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. హరిబాబుతో లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఉషారాణి తెలిపారు.

అవీ..ఇవీ..

నేడు ప్రవీణ్‌ప్రకాష్ పర్యటన

ఒంగోలు(విద్య), మార్చి 1: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన ఒంగోలుకు చేరుకుంటారు. శనివారం చీమకుర్తి మ ండలంలోని పాఠశాలలను సందర్శిస్తారు. దీంతో ఒంగోలు డివిజన్, ముఖ్యంగా మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులను పాఠశాల విద్యా ఆర్‌జేడీ.లింగేశ్వరరెడ్డి, డీఈవో సుభద్రలు అప్రమత్తం చేశారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులన్నింటినీ అప్‌డేట్‌గా ఉంచాలని వారు ఆదేశించారు.

ఏపీటెట్‌కు 63 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 1: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్)కు శుక్రవారం 63 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. నగరంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం సెషన్‌కు 393 మందికి 358 మంది హాజరు కాగా 35మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 393 మందికి 365 మంది హాజరు కాగా 28మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ రెండు సెషన్లలో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

బీఎన్ నివాళులు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, మార్చి 1: ఉప్పుగుండూరులోని యాదవ కాలనీకి చెందిన మిండాల మునెమ్మ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్ కలిసి మునెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల లక్ష్మీవరప్రసాదు, కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, తెలగతోటి జాన్సన్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత : ఎస్పీ

ఒంగోలుక్రైం,మార్చి1: జిల్లాలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అంతేగాకుండా పరీక్షలు జరిగే ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీసులు మూసివేయిచారు. మాస్ కాపియింగ్, మాల్ ప్రాక్టీస్‌కు ఎవరైన పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అన్ని పరీక్షా కేంద్రాలను పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒంగోలులోని ఏబీఎం కాలేజీలో టూటౌన్ సీఐ జగదీష్ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

ఉత్తరప్రదేశ్ ఘటనపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు క్రైం, మార్చి 1: ఉత్తరప్రదేశ్‌లో మైనర్ బాలుడుపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన మీద సిట్టింగ్ జడ్జితో విచారణ జరింపిచాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్దండి మల్లిఖార్జునరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రకాశంభవన్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, మన్నం ప్రసన్నరాజు, తెలగపూడి బుజ్జి, బత్తుల శాంతపాల్ పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్‌వాదుల మహాసభ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో అంబేడ్కర్ వాదుల మహాసభను నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. దళిత బహుజన సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ వాదులు, మేధావులు పాల్గొలని కోరారు.

జనాభా ప్రాతిపదికన యాదవులకు సీట్లు కేటాయించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1: జనాభా ప్రాతిపదికన యాదవులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపీకృష్ణయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 15శాతంగా ఉన్నటువంటి యాదవులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాన్నారు. యాదవులకు తగిన విధంగా సీట్లు కేటాయించకపోతే అటువంటి పార్టీలకు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. యాదవులను విస్మరిస్తే పుట్టగతులు ఉండవని ఆయన విమర్శించారు.

వెంగముక్కలపాలెంలో సేవా కార్యక్రమాలు



టార్పాలిన్ పట్టను అందజేస్తున్న నిర్వాహకులు, మేయర్ సుజాత

ఒంగోలు(విద్య), మార్చి 1: ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వెంగముక్కలపాలెంలో వారం రోజుల పాటు జరిగే జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్విస్ విద్యా సంస్థలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్విస్ కళాశాల యూత్ రెడ్ క్రాస్ తరపున ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైజనిక్ కిట్స్, టార్పాలిన్ పట్టలను మదర్‌తెరిస్సా కాలనీలోని పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ చైర్మన్ సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్‌చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ దక్షిణామూర్తి, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మద్దిపాడు, మార్చి 1: ఇంటర్మీడియట్ పరీక్షలు మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు నిర్వహించారు. మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

ఎస్సీల హక్కులను కాలరాసేందుకే వర్గీకరణ చిచ్చు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : షెడ్యూల్ కులాల హక్కులను కాలరాసేందుకే ఎస్సీ వర్గీకరణ చిచ్చును ఆర్ఎస్ఎస్, బీజేపీ మళ్లీ రగిలించాయని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. ఒంగోలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈనెల 3న బాపట్లలో జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మాలల సింహగర్జన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందకృష్ణ మనువాదుల ఉచ్చులో చిక్కుకొని షెడ్యూల్డ్ కులాలు కూర్చున్న కొమ్మను నరుకుతున్నారని విమర్శించారు. ఆదివారం బాపట్లలో జరిగే సింహగర్జనలో జిల్లాలోని మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీలం నాగేంద్రరావు, దారా అంజయ్య వేలూరి శ్రీనివాసరావు, కాకుమాను రవి, దార్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం

ఒంగోలు(కల్చరల్), మార్చి 1: తల్లిదండ్రులు దూరమై అనాథలుగా మారిన చిన్నారులకు సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. శుక్రవారం ఒంగోలులోని ట్రస్ట్ కార్యాలయంలో బెస్తవారపేట మండలం జగ్గంభట్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన భావన, యశ్వంత్, కీర్తనలకు ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ ఆధ్వర్యంలో ప్రవాసభారతీయులు విజయ్‌కుమార్ సహకారంతో రూ.37500 ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు చిన్నారులు తల్లిదండ్రులకు దూరమై అనాథలుగా మారారని, వారిలో భావన పొలం కూలి పనులకు వెళుతూ కుటుంబ భారం మోస్తుందన్నారు. వారు ఇంటి నిర్మాణం కోసం అభ్యర్థించగా ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, మండవ లావణ్య కోచూరి శ్రీదేవి, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఒంగోలు నగరం, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇందుకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎల్‌బీజీభవన్‌లో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు 42 రోజుల పాటు చేసిన సమ్మె ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి పలు హామీలను ఇచ్చిందన్నారు. సమ్మె కాలానికి వేతనం కూడా ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అర్హత ఉన్న హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఆయాలు పోస్టులు భర్తీ చేయకపవటంతో ఆ పని కూడా కార్యకర్తలే చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు రమేష్, జిల్లా నాయకులు కేవీ.సుబ్బమ్మ, ఎన్.ధనలక్ష్మి, ఎల్లమ్మ, హేమిమా తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

జాండ్రపేట(చీరాలటౌన్), మార్చి 1: మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం. జాండ్రపేట ఎస్టీ కాలనీకి చెందిన పాములపాటి విజయ్, రమాదేవి దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రోజువారీ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థికపరమైన సమస్యలతో ఇటీవల కుటుంబంలో వివాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పెద్దలు వీరిమధ్య సఖ్యత కుదిర్చి పరిస్థితిని చక్కబెట్టారు. రెండు రోజులుగా మరోకుమారుడి వివాదం జరిగి అతని భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన విజయ్ అర్ధరాత్రి ఇంటిముందు చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడు మృతి

ఇంకొల్లు, మార్చి 1: వరిగడ్డి ట్రాక్టర్, టీవీఎస్ మోటర్‌సైకిల్ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. మార్టూరు మండలం కోలలపూడికి చెందిన సూరగాని సుబ్బారావు ఇంకొల్లు ప్రాంతంలో మోపెడ్‌పై చీపుర్లు అమ్ముకుంటున్నారు. ఈక్రమంలో గంగవరం రోడ్డులో ఓ ఫ్యాక్టరీలో నుంచి బయటకు వస్తుండగా ట్రాక్టర్, మోపెడ్ ఢీకొన్నాయి. ప్రమాదంలో మోపెడ్ నడుపుతున్న సుబ్బారావు(70) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాకర్ రోడ్డు పక్కన ఉన్న మురుగుకాల్వలోకి దూసుకుపోయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ గాజుల శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ యువకుడు మృతి

ఇంకొల్లు, మార్చి 1: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కొణికి రోడ్డులో అప్పేరు వాగు సమీపంలో జరిగింది. బీహార్ రాష్ట్రం మధ్యపూర్ జిల్లా సల్మాతుళ్లి గ్రామానికి చెందిన ఉదయకుమార్ ఇంకొల్లు ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి అప్పేరు వాగు సమీపంలో బైకుపై వెళుతున్న ఉదయకుమార్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు మీద ఉన్న మరో బీహార్‌కు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్లు అందజేత

అద్దంకి, మార్చి 1 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు శుక్రవారం అందజేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. పంగులూరు మండలం చందలూరుకు చెందిన ముప్పనేని వెంకటేశ్వర్లు, బల్లికురవ మండలం గొర్రెపాడుకు చెందిన జి.ఆదిలక్ష్మి 15 రోజుల క్రితం అద్దంకి పట్టణానికి వచ్చిన సమయంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రెండు సెల్‌ఫోన్‌లను గుర్తించి శుక్రవారం బాధితులకు సీఐ కృష్ణయ్య అందజేశారు. సెల్‌ఫోన్‌ల రికవరీ కోసం కృషిచేసిన కానిస్టేబుల్ ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ అభినందించారు.

వైభవంగా వేణుగోపాలుని రథోత్సవం



రథంపైకి వస్తున్న వేణుగోపాలుడు

తర్లుపాడు, మార్చి 1 : తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపా లస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్ర వారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కారంపూడి వెంకట రమణాచార్యులు, భార్గవ రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు వేణుగోపాలస్వామి విగ్రహాలను రథంపైకి భక్తులు తీసుకొచ్చారు. రథోత్సవాన్ని తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయా కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చు కున్నారు. ఉత్సవంలో ఉభయదాతలు వాడే లా దత్తాత్రేయ శ్రీనివాసులు, వాడేల వెంకట రమణ, వాడేల ప్రకాశ్‌రావు, వాడేల సుబ్బా రావు, సుధాకర్‌రావులు వ్యవహరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త జవాజి విజయ భాస్కర్‌రావు, ధర్మపత్ని శేషకుమారి, జవాజి సాయికృష్ణ హిమసాయిలక్ష్మీలు విశేష పూజలు చేశారు. భక్తులకు లడ్డూప్రసాదాలు పంపిణీ చేశారు. మార్కాపురం నియోజక వర్గ వైసీపీ సమనవ్యకర్త అన్నా రాంబాబు, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, తహశీల్దార్ అజీద్ అహ్మద్‌లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు భారీగా అన్నదానం చేశారు. దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్, పొదిలి సీఐ ఈ.మల్లికార్జున్, తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్ ఆధ్వర్యం లో కొనకనమిట్ల, పొదిలి, ముండ్లమూరు, కురిచేడు ఎస్ఐలు మాధవరావు, కోటయ్య, నాగరాజు, సుమన్‌లు బందోబస్తు నిర్వహిం చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైసీపీ అరాచకాలను ఎండగట్టండి



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 1 : టీడీపీ కార్యకర్తలు ప్రతిఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల మానిఫెస్టోను ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు వివరించాలన్నారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలు వివరించారు. అంతేకాక రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను కూడా ప్రజలకు తెలియచెప్పాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు లబ్ధిచెందకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజల మద్దతు పొందాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాను టీడీపీ, జనసేనలు బలపరచిన అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనను టీడీపీ క్లస్టర్ యూనిట్, బూత్, కుటుంబ సాధికార సరథులు విజయవంతం చేయాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం) : టీడీపీ, జనసేనల మద్దతుతో నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి నియోజక వర్గానికి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1300 కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారని, అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు బండ్లమూడి ఆంజనేయులు, కొనతం రంగారెడ్డి తెలిపారు. 'బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా అర్ధవీడు మండలం మొహిద్దీ న్‌పురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఇంటింటి కి తిరిగి ప్రచారం చేశారు. నాడు టీడీపీ హయాంలో అశోక్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. అశోక్‌రెడ్డి గిద్దలూరులో నివాసం ఉంటూ అందుబాటులో ఉండే స్థానిక నాయకుడని, కావున అశోక్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

సమష్టిగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

టీడీపీ టంగుటూరు మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

టంగుటూరు, మార్చి 1 : నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి కొండపిలో మరోసారి టీడీపీ జెండా ఎగురవేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలకు కేడర్‌ను సమయాత్తం చేసేందుకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడవద్దన్నారు. ఎన్నికల్లో టీడీపీ గెలవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేతను ఉపయోగించుకోవాలని, గ్రామాల్లో ఇన్‌యాక్టివ్‌గా ఉన్న పార్టీ శ్రేణులను గుర్తించి చైతన్య పరచాలని సూచించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఆదమరిస్తే మళ్లీ ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తెలుగు రైతు నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపునకూ ముందుండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అలజడులు సృష్టించేందుకు వైసీపీ సిద్ధమైందని, అవసరమైతే అలాంటి చర్యలను ఎదుర్కొనేందుకు సమష్టిగా ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ మండల కార్యదర్శి రవీంద్ర, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్, మండల కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పిడికిటి యలమంద తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభా స్థలం పరిశీలన

టంగుటూరు పరిధిలో టీడీపీ నాయకుల పర్యటన



స్థల పరిశీలనలో టీడీపీ నాయకులు

టంగుటూరు, మార్చి 1 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మండల కేంద్రమైన టంగుటూరులో త్వరలో శంఖారావం నిర్వహించనున్నారు. కొండపి నియోజకవర్గ స్థాయి సభను టంగుటూరులో ఏర్పాటు చేయాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. దీంతో ఆపార్టీ నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం సభా స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిలో జునో పక్కన బైపాస్ ఫ్లైఓవర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డులో జమ్ములపాలెంకు చెందిన పులివర్తి వారి 9ఎకరాల స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉంది. అక్కడ సభ ఏర్పాటుకు నిర్ణయించారు. ఆప్రాంతం జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి మండలాలకు అనుకూలంగా ఉంటుందని, అటు సింగరాయకొండ మీదుగా వచ్చే పొన్నలూరు, ఇటు కొండపి మీదుగా వచ్చే మర్రిపూడి మండలాలకు అనువుగా ఉంటుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. నియోజకవర్గం నుంచి 25వేల మంది సభకు వచ్చే అవకాశం ఉంది. జన సమీకరణకు పార్టీ శ్రేణులను సమాయత్తపరిచేందుకు శుక్రవారం సాయంత్రం టంగుటూరులోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. లోకేష్ సభకు ముందుగా నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. సభావేదిక స్థలం, ఏర్పాట్ల పరిశీలనలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, తెలుగు యువత మండల అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కసుకుర్తి భాస్కర్, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భానుచందర్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు దయానందం, కాకుటూరివారిపాలెం టీడీపీ నాయకుడు కొమ్మినేని వెంకట్రావు, నాయకులు సవలం సుధాకర్, బ్రహ్మయ్య, కారుమంచి అనిల్‌కుమార్, దామతోటి వంశీకృష్ణ, మేడికొండ శ్రీను ఉన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసం

రాత్రి పూట నేలమట్టం వరకు పడగొట్టి

కాలువలోకి విసిరేసిన వైనం



టీడీపీ ప్రభుత్వంలోని శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బల్లికురవ, మార్చి 1 : టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఈ సంఘటన కొప్పెరపాడు - వినుకొండ రోడ్డులో చోటుచేసుకుంది. బల్లికురవ మండలం కొప్పెరపాడు నుంచి వినుకొండ అర్‌అండ్‌బీ రోడ్డులో ఆరు కిలోమీటర్ల సింగిల్ రోడ్డును తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2018లో సుమారు రూ.ఆరు కోట్లతో డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గొర్రెపాడు, కూకట్లపల్లి యానాది సంఘం వరకు ఈ రోడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచారు. అప్పట్లో ఈ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా నార్కెట్‌పల్లి రోడ్డులోని కొప్పెరపాడు - వినుకొండ రోడ్డు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ రోడ్డున చూసిన బాటసారులు నిత్యం టీడీపీ ప్రభుత్వం ఎంతో మంచి పని చేసింది, రోడ్డును బాగా అభివృద్ధి పరిచారని అభినందిస్తున్నారు. రోడ్డు పక్కనే శిలాఫలకం ఉండటంతో అక్కసుతో గుర్తుతెలియని వ్యక్తులు దానిని ధ్వంసం చేశారు. దిమ్మెగోడలు కూడా ముక్కలు ముక్కలు చేసి రోడ్డు పక్కన పడేశారు. అలాగే, పేర్లు ఉన్న బోర్డును పక్కనే ఉన్న కాలువలోకి విసిరేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన విషయం తెలిసిన టీడీపీ నేతలు అక్కడకి చేరి వైసీపీ వారే కావాలనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లు వేయటం చేతకాదు గాని, చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. గ్రామాలలో ఉన్న పలు రోడ్లు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే అభివృద్ధి చేశారని, చేతనైతే రోడ్ల మరమ్మతులు చేయాలిగాని శిలాఫలకాలను పడగొట్టటం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కావాలనే శిలాఫలకాన్ని పడగొట్టి ప్రజలలో ఆలజడి సృష్టించేందుకు కొందరు ఈ పనులకు దిగుతున్నారని వారు ఆరోపించారు.

మత్స్యశాఖ కార్యాలయానికి తాళం

- ఒంగోలుకే పరిమితమైన ఇన్‌చార్జ్ అధికారి
- అయోమయంలో గంగపుత్రులు



తాళం వేసిన కార్యాలయం

కంభం, మార్చి 1 : కంభం మత్స్యశాఖ సహాయ పరిశీలక అధికారి కార్యాలయం ఎప్పుడూ తాళం వేసి ఉంటోంది. సంబందిత మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఈ కార్యాలయానికి వచ్చే 9 మండలాల పరిధిలోని మత్స్యకారులు కార్యాలయానికి వచ్చి వెను తిరుగుతున్నారు. కంభం మత్స్యశాఖ కార్యాలయం పరిధిలో కంభం, అర్ధవీడు, బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, మార్కాపురం, మొహిద్దీన్‌పురం మొత్తం 9 మండలాల మత్స్యశాఖ సొసైటీలు ఉన్నాయి. గత ఏడాది కంభం మత్సశాఖాధికారిగా ఉన్న పొట్టయ్య బదిలీపై వెళ్లాడు. దీంతో ఒంగోలుకు చెందిన మత్స్యశాఖ అధికారి సుభానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఒంగోలులో బాధ్యతలు చేస్తుండగా అవసరమైతే ఎప్పుడో ఒకసారి కంభానికి వచ్చి వెళుతుంటారని తెలిసింది. తొమ్మిది మండలాల్లోని చెరువుల్లో చేపలు పెంచడం, అమ్మడం, మత్స్యశాఖ సొసైటీల ఏర్పాటు, ప్రభుత్వం అందించే పథకాలు, తదితర అంశాలను ఈ అధికారే అందించాలి. కంభం చెరువు పరిధిలో పలు మత్స్యశాఖ సొసైటీలు ఉన్నాయి. కంభం చెరువులో చేపలు పట్టే విషయంలో ఈ సొసైటీల మధ్య ఘర్షణలు జరిగిన విషయం విధితమే. ఏ సమస్య వచ్చినా పరిష్కరించాల్సిన బాధ్యతలు అధికారివే. ప్రస్తుతం మత్స్యశాఖ కార్యాలయానికి ఏడాదికాలంగా రెగ్యులర్ అధికారి లేకపోవడం ఇబ్బందిగా ఉందని, రెగ్యులర్ అధికారిని నియమించాల్సిందిగా సొసైటీ వారు కోరుతున్నారు.

ఇన్‌చార్జి అధికారి సుభాని వివరణ

ఒంగోలులో ఉన్న కంభం మత్స్యశాఖ ఇన్‌చార్జి అధికారి సుభానిని వివరణ కోరగా తనకు ఒంగోలులోనే సమయం గడిచిపోతుందని, కంభం పరిధిలో ఏ సమస్య వచ్చిన తనకు ఫోన్ చేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

తరుముకొస్తున్న తాగునీటి ఎద్దడి

అడుగంటిన భూగర్భజలాలు, నీరందని బోర్లు



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

త్రిపురాంతకం, మార్చి 1: 'వేసవి సమీపిస్తోంది. తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. పల్లెల్లో నీటి సమస్య రోజురోజుకు పెరుగుతోం ది.' భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అయినా తాగునీటి పథకాలు, చేతి పంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో మంచినీటి సమస్యలతో పల్లె ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు, పాలకులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 600 చేతిపంపులు ఉండగా 250 పని చేస్తున్నాయి. మిగిలినవి మరమ్మత్తులకు గురి కావడం, భూగర్భజలాలు అడుగంటడంతో మిగిలిన చేతి పంపులకు నీరు రావటం లేదు. మండలం మొత్తం మీద 37 వాటర్ ట్యాంకులు గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉండగా వీటిలో కేవలం 13 మాత్రమే పనిచేస్తున్నాయి. అయినా అధికారులు, పాలకులు వీటిపై దృష్టి సారించలేదు. మండలంలో 50కి పైగా డీప్ బోర్లు, మిని ట్యాంకులు ఉండగా సగానికి పైగా పనిచేయడం లేదు. దీనికి తోడు చెరువులు, బావులు, కుంటలు వర్షాలు లేక ఎండిపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలమవుతోంది. మండలంలో 20 చెరువుల వరకు ఉండగా వర్షాలులేక ఒక్క చెరువులోనూ చుక్క నీరు కూడా లేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటా యి. రెండు నెలల క్రితం విడుదల చేసిన సాగర్ జలాలలో కొన్ని చెరువులను నీటితో నింపారు. గొల్లపల్లి ఎస్ఎస్ ట్యాంకుకు ప్రస్తుతం 50 శాతం సాగర్ జలాలు ఉన్నాయి. దీని పరిధిలో 34 గ్రామాలలకు నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా 22 గ్రామాలకు మాత్రమే సరఫరా చేశారు. మిగిలిన చోట్ల పైపులైన్లు సమస్యతో నీరు గమ్యానికి చేరడంలేదు. ప్రస్తుతం మండలంలోని కేశినేనిపల్లి, గొల్లవాండ్లపల్లి, డీవీఎన్ కాలనీల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రోజుకు 2 ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో మండలంలోని దువ్వలి, చెర్లోపల్లి, లేళ్లపల్లి గ్రామాలతోపాటు మిగిలిన గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం కనిపిస్తోంది. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి మరమ్మత్తులకు గురైన మంచినీటి ట్యాంకులను, చేతిపంపులను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఏఈఈ ఏ.హనుమాన్‌బాబు మాట్లాడుతూ మండలంలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



పనిచేయని చేతిపంపు

శరవేగంగా పృథులగిరి రహదారి నిర్మాణం



శరవేగంగా జరుగుతున్న పృథులగిరి రహదారి పనులు

మర్రిపూడి, మార్చి 1 : ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన పృథులగిరికి వెళ్లే రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మర్రిపూడి నుంచి పృథులగిరి సోపానాల వరకు.. అక్కడి నుంచి జాఫ్లాపురం యానాదికాలనీ వరకు 10.8 కిలో మీటర్ల రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.8.5కోట్ల ఆర్ఐడీఎఫ్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. గత నెలలో మంత్రి ఆదిమూలపు సురేష్ శంకుస్థాపన చేశారు. పది రోజులుగా రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే పృథులగిరి క్షేత్రానికి వెళ్లే భక్తులకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. అయితే మధ్యలో 1,600 మీటర్ల మేర అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. అందుకోసం పంచాయతీరాజ్ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈనెల 19వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆలోపు కొండవరకు తారు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ఒరిగేదేమీ లేదు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

టంగుటూరు, మార్చి 1 : ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ఉద్యోగులు, కార్మికులు, పేదలకు ఒరిగేదేమీ లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. కొండపి నియోజకవర్గ సీఐటీయూ ముఖ్యబాధ్యుల సమావేశం శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలూ.. ప్రజలపై భారాలు' అనే అంశాన్ని కొండారెడ్డి వివరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ లెనిన్ తన జీవితాన్ని రష్యాలో సోషలిజం కోసం అర్పించారని వివరించారు. ఆయన అడుగుజాడల్లోనే కార్మిక వర్గం నడవాలని సూచించారు. శుక్రవారం నుంచి ఈనెల 15వరకు సీఐటీయూ నేతృత్వంలో జనరల్ బాడీలు, గ్రూపు మీటింగ్‌లు, కరపత్రాల పంపిణీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను జనానికి వివరించాలని సమావేశం తీర్మానించింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.రాము, జి.వందనం, అంకయ్య, నాయకులు కె.విజయకుమార్, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు 16 మంది గైర్హాజరు



సమయం మించిపోతుండటంతో పరీక్షా కేంద్రం వద్దకు పరిగెడుతున్న విద్యార్థిని

కొండపి, మార్చి 1 : ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రంలో ప్రథమ సంవత్సర పరీక్షకు 315 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 299 మంది రాశారు. 16 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆఖరి నిమిషంలో కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు ఉరుకులు, పరుగులు పెట్టారు. కేటాయించిన తరగతి గదులు, రోల్ నంబర్లు తదితర విషయాలను విద్యార్థులకు బందోబస్తు నిర్వహణలో ఉన్న కొండపి సీఐ పాండురంగారావు వివరిస్తూ సాయం చేశారు.

ముడిరాయి లారీ పట్టివేత

బల్లికురవ, మార్చి 1 : పర్మిట్ లేకుండా అక్రమ మార్గంలో తరలిస్తున్న గ్రానైట్ ముడిరాయి లారీని శుక్రవారం మైనింగ్ శాఖ అర్ఐ రాజు అదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి ఫ్యాక్టరీలకు తరలివెళుతున్న లారీని నిలుపుదల చేసి తనిఖీ చేయగా పర్మిట్ లేకపోవటంతో అర్ఐ అదుపులోకి తీసుకొన్నారు.

వైసీపీ అరాచకాలను ఎండగట్టండి

- టీడీపీ కార్యకర్తలకు ముత్తుముల దిశానిర్దేశం
- విస్తృతంగా భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు


మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 1 : టీడీపీ కార్యకర్తలు ప్రతిఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని చీతిరాల కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల మానిఫెస్టోను ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు వివరించాలన్నారు. గ్రామాలలో విస్తృతంగా పర్యటించి పార్టీ కార్యక్రమాలు వివరించారు. అంతేకాక రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను కూడా ప్రజలకు తెలియ చెప్పాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు లబ్ధిచెందకుండా చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజల మద్దతు పొందాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాను టీడీపీ, జనసేనలు బలపరచిన అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనను టీడీపీ క్లస్టర్ యూనిట్, బూత్, కుటుంబ సాధికార సరధులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం) : టీడీపీ, జనసేనల మద్దతుతో నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి నియోజకవర్గానికి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1300 కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారని, అర్ధవీడు మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు బండ్లమూడి ఆంజనేయులు, కొనతం రంగారెడ్డి తెలిపారు. 'బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. నాడు టీడీపీ హయాంలో అశోక్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. అశోక్‌రెడ్డి గిద్దలూరులో నివాసం ఉంటూ అందుబాటులో ఉండే స్థానిక నాయకుడని, కావున అశోక్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఎర్రన్న, మాజీ ఎంపీపీ చిన్నకాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన కార్యకర్తలు


కంభంలో టీడీపీ నాయకుల ప్రచారం

కంభం : రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కంభం మండలం జంగంగుంట్ల గ్రామంలో, కంభం పట్టణంలోని తెలుగు వీధిలో టీడీపీ నాయకులు పర్యటించారు. ఇంటింటికి తిరిగి 'మన గిద్దలూరు మన ముత్తుముల', 'బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ' కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలో ప్రజలకు అందించే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధవీడు (కంభం) : అర్ధవీడు మండలంలోని పలు గ్రామాలలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. టీడీపీ, జనసేనల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డిని గెలిపించుకునేందుకు మండలంలోని పార్టీ శ్రేణులు ముందుకు రావాలని టీడీపీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండ్లమూడి ఆంజనేయులు, కొణతం రంగారెడ్డిలు పిలుపునిచ్చారు. పాపినేనిపల్లి, అంకభూపాలెం, మొహిద్దీన్‌పురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. నాడు టీడీపీ హయాంలో ఆయన ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన అన్నివేళలా అందుబాటులో ఉంటాడని, నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజాసంక్షేమం కోసం కష్టపడే వ్యక్తి మన ముత్తుముల అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. బీసీ నాయకులు ఎర్రన్న, అర్ధవీడు మండల మాజీ ఎంపీపీ చిన్న కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగికదాడులు అరికట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మహిళామోర్చా నాయకురాళ్లు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టాలని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు వాసుప్రియా మాట్లాడుతూ.. మహిళలకు రక్షణలేకుండా పోతోందన్నారు. మహిళలు, పిల్లలపై దాడులు చేసేవారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి, మల్లేశ్వరి, రాణి, సీతా, వెంకటమ్మ పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏపీపీ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1: హైదరాబాద్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. మార్కాపురంలోని 6వ అదనపు జిల్లా న్యాయస్థానంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసే ఆర్.బాలు నాయక్ ఈ సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో నూతన క్రిమినల్ చట్టాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. వీటిలో నేర్చుకున్న అంశాలు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సదస్సులో ఏపీ, తెలంగాణా, ఒడిస్సా, పాండిచ్చేరి, కేరళల నుంచి ఐపీఎస్ అధికారులు, డీఎస్పీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న బాలునాయక్‌కు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ ప్రశంసాపత్రం అందజేశారు.

రేపు పల్స్ పోలియో


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పొదిలి, మార్చి 1 : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఈ నెల 3న నిర్వహించనున్నట్లు ఉప్పలపాడు వైద్యాధికారి సుగుణకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీ నుంచి పట్టణంలో అవగాహన ర్యాలి నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని అన్ని ప్రాంతాలు, ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేసే కేంద్రాలకు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. కనుక అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల వయస్సు లోపు పిల్లల వరకు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు అందే విధంగా సిబ్బంది పనిచేయాలని కోరారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శరత్, ఏఎన్ఎంలు, ఆశాలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గిద్దలూరు టౌన్, మార్చి 1 : రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి గాయాల పాలైన ఘటన మండలంలోని దిగువమెట్ట సమీపంలోని రైల్వే వంతెన వద్ద చోటు చేసుకొంది. ఈ ఘటనలో రైలులో ప్రయాణిస్తున్న నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదానికి గురై గాయపడ్డాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నేను స్థానికుడిని, అందుబాటులో ఉంటా

- టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి


భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 1 : తాను పుట్టి పెరిగింది ఈ ప్రాంతంలోనేనని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో పార్టీ నాయకులు నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధిని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాను టీడీపీ, జన సేనల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలపించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్థానికంగా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడుకటికె యోగానంద్, వైస్ సర్పంచ్ రసూల్, ప్రధాన కార్యదర్శి యాసం లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు సూరా ఆదినారాయణరెడ్డి, నీలి రామక్రిష్ణ, సూరా సత్యంరెడ్డి, కడియం సుబ్బయ్య, రెడ్డి కాశిరెడ్డి, నాయబ్‌రసూల్, భవనం శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరుముకొస్తున్న తాగునీటి ఎద్దడి

అడుగంటిన భూగర్భజలాలు, నీరందని బోర్లు

త్రిపురాంతకం, మార్చి 1: 'వేసవి సమీపిస్తోంది. తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. పల్లెల్లో నీటి సమస్య రోజురోజుకు పెరుగుతోంది.' భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అయినా తాగునీటి పథకాలు, చేతి పంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో మంచినీటి సమస్యలతో పల్లె ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వేసవి సమీపిస్తుండంతో తాగునీటి సమస్యను తీర్చేందుకు అధికారులు, పాలకులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 600 చేతిపంపులు ఉండగా 250 పని చేస్తున్నాయి. మిగిలినవి మరమ్మత్తులకు గురికావడం, భూగర్భజలాలు అడుగంటడంతో మిగిలిన చేతి పంపులకు నీరు రావటం లేదు. మండ లం మొత్తం మీద 37 వాటర్ ట్యాంకులు గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉండగా వీటిలో కేవలం 13 మాత్రమే పనిచేస్తున్నాయి. అయినా అధికారులు, పాలకులు వీటిపై దృష్టి సారించలేదు. మండలంలో 50కి పైగా డీప్ బోర్లు, మిని ట్యాంకులు ఉండగా సగానికి పైగా పనిచేయడం లేదు. దీనికి తోడు చెరువులు, బావులు, కుంటలు వర్షాలు లేక ఎండిపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలమవుతోంది. మండలంలో 20 చెరువుల వరకు ఉండగా వర్షాలులేక ఒక్క చెరువులోనూ చుక్క నీరు కూడా లేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటాయి. రెండు నెలల క్రితం విడుదల చేసిన సాగర్ జలాలలో కొన్ని చెరువులను నీటితో నింపారు. గొల్లపల్లి ఎస్ఎస్ ట్యాంకుకు ప్రస్తుతం 50 శాతం సాగర్ జలాలు ఉన్నాయి. దీని పరిధిలో 34 గ్రామాలలకు నీటిని సరఫరా చేయాల్సి ఉన్నా 22 గ్రామాలకు మాత్రమే సరఫరా చేశారు. మిగిలిన చోట్ల పైపులైన్లు సమస్యతో నీరు గమ్యానికి చేరడంలేదు. ప్రస్తుతం మండలంలోని కేశినేనిపల్లి, గొల్లవాండ్లపల్లి, డీపీఎస్ కాలనీల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆర్‌డబ్ల్యూయస్ ఆధ్వర్యంలో రోజుకు 2 ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో మండలంలోని దువ్వలి, చెర్లోపల్లి, లేళ్లపల్లి గ్రామాలతోపాటు మిగిలిన గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం కనిపిస్తోంది. అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి మరమ్మత్తులకు గురైన మంచినీటి ట్యాంకులను, చేతిపంపులను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై ఏఈఈ ఏ.హనుమాన్‌బాబు మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని తరలిస్తామన్నారు.


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు


పనిచేయని చేతిపంపు

వైభవంగా వేణుగోపాలుని రథోత్సవం

తర్లుపాడు, మార్చి 1 : తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానర్చకులు కారంపూడి వెంకటరమణాచార్యులు, భార్గవ రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు వేణుగోపాలస్వామి విగ్రహాలను రథంపైకి భక్తులు తీసుకొచ్చారు. రథోత్సవాన్ని తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయా కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఉభయదాతలు వాడేలా దత్తాత్రేయ శ్రీనివాసులు, వాడేల వెంకటరమణ, వాడేల ప్రకాశ్‌రావు, వాడేల సుబ్బారావు, సుధాకర్‌రావులు వ్యవహరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త జవాజి విజయభాస్కర్‌రావు, ధర్మపత్ని శేషకుమారి, జవాజి సాయికృష్ణ, హిమసాయిలక్ష్మీలు విశేష పూజలు చేశారు. భక్తులకు లడ్డూప్రసాదాలు పంపిణీ చేశారు. మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమనవ్యకర్త అన్నా రాంబాబు, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, తహశీల్దార్ అజీద్ అహ్మద్‌లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు భారీగా అన్నదానం చేశారు. దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్, పొదిలి సీఐ ఈ.మల్లికార్జున్, తర్లుపాడు ఎస్ఐ వేముల సుధాకర్ ఆధ్వర్యంలో కొనకనమిట్ల, పొదిలి, ముండ్లమూరు, కురిచేడు ఎస్ఐలు మాధవరావు, కోటయ్య, నాగరాజు, సుమన్‌లు బందోబస్తు నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


రథంపైకి వస్తున్న వేణుగోపాలుడు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మత్స్యశాఖ కార్యాలయానికి తాళం

- ఒంగోలుకే పరిమితమైన ఇన్‌చార్జ్ అధికారి
- అయోమయంలో గంగపుత్రులు

కంభం, మార్చి 1 : కంభం మత్స్యశాఖ సహాయ పరిశీలక అధికారి కార్యాలయం ఎప్పుడూ తాళం వేసి ఉంటోంది. సంబంధిత మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో అందుబా టులో ఉండడం లేదు. దీంతో ఈ కార్యాలయా నికి వచ్చే 9 మండలాల పరిధిలోని మత్స్య కారులు కార్యాలయానికి వచ్చి వెను తిరుగుతున్నారు.

కంభం మత్స్యశాఖ కార్యాలయం పరిధిలో కంభం, అర్ధవీడు, బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, మార్కాపురం, మొహిద్దీన్‌పురం మొత్తం 9 మండలాల మత్స్యశాఖ సొసైటీలు ఉన్నాయి. గత ఏడాది కంభం మత్స్యశాఖాధికారిగా ఉన్న పొట్టయ్య బదిలీపై వెళ్లాడు. దీంతో ఒంగోలుకు చెందిన మత్స్యశాఖ అధికారి సుభానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఒంగోలులో బాధ్యతలు చేస్తుండగా అవసరమైతే ఎప్పుడో ఒకసారి కంభానికి వచ్చి వెళుతుంటారని తెలిసింది. తొమ్మిది మండలాల్లోని చెరువుల్లో చేపలు పెంచడం, అమ్మడం, మత్స్యశాఖ సొసైటీల ఏర్పాటు, ప్రభుత్వం అందించే పథకాలు, తదితర అంశాలను ఈ అధికారే అందించాలి. కంభం చెరువు పరిధిలో పలు మత్స్యశాఖ సొసైటీలు ఉన్నాయి. కంభం చెరువులో చేపలు పట్టే విషయంలో ఈ సొసైటీల మధ్య ఘర్షణలు జరిగిన విషయం విదితమే. ఏ సమస్య వచ్చినా పరిష్కరించాల్సిన బాధ్యతలు అధికారివే. ప్రస్తుతం మత్స్యశాఖ కార్యాలయానికి ఏడాదికాలంగా రెగ్యులర్ అధికారి లేకపోవడం ఇబ్బందిగా ఉందని, రెగ్యూలర్ అధికారిని నియమించాల్సిందిగా సొసైటీ వారు కోరుతున్నారు.


తాళం వేసిన కార్యాలయం

ఇన్‌చార్జి అధికారి సుభాని వివరణ

ఒంగోలులో ఉన్న కంభం మత్స్యశాఖ ఇన్‌చార్జి అధికారి సుభానిని వివరణ కోరగా తనకు ఒంగోలులోనే సమయం గడిచిపోతుందని, కంభం పరిధిలో ఏ సమస్య వచ్చిన తనకు ఫోన్ చేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

- బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, మార్చి 1: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని చిన్నదోర్నాల ఎస్సీ కాలనీలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీల కోసం 27 పథకాలు అమలు చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిందన్నారు. ప్రధానంగా కార్పోరేషన్ ద్వారా విరివిగా రుణాలు మంజూరు, విదేశీవిద్యకు లక్షలు రూపాయలు అందజేత, వాహనాలు మంజూరు, పెళ్లికానుక, పండుగ కానుకలు ఇచ్చిందని, సబ్‌ప్లాన్ నిధులతో వీధి వీధిన సిమెంటు రోడ్లు నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పిల్లలకు మేనమామ నంటూ సీఎం జగన్ కాలనీల్లోని పాఠశాలలు విలీనం పేరుతో మూసి వేసి పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. ఇసుక కొరతతో కార్మికుల పొట్టకొట్టాడని, ఉద్యోగులకు సక్రమంగా నెల జీతాలివ్వక ఇబ్బందులు పెడుతున్నారని, కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని, రైతు కూలీలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కనీసం గ్రామాల్లో గుక్కెడు నీటి కోసం రోడ్డెక్కాల్సిన అగత్యం ఏర్పడిందని ఆరోపించారు.టీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే ప్రతి ఇంటికి నీటి కొళాయి ఏర్పాటు, బీసీలకు రక్షణ చట్టం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు,చంటి, చల్లా వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, షేక్ ఇస్మాయిల్, భాష, మౌలాలి, పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1 : ఇంటర్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శ్రీ సాధన, రెడ్డి మహిళా, కమలా, గౌతమి, ఎస్ఎస్ఆర్, ట్రినిటీ, ఏపీ సోషల్ వెల్ఫేర్ రాయవరం కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.


కళాశాల వద్దఎదురు చూస్తున్న విద్యార్థులు

అవీ..ఇవీ..

ఆర్థిక అక్షరాస్యతతోనే భవితకు భద్రత


మాట్లాడుతున్న శిక్షకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1: ఆర్థిక అక్షరాస్యతతోనే భవితకు ఖచ్చితమైన భద్రత ఉంటుందని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సభ్యులు ఏహెజ్కేలు అన్నారు. స్థానిక శ్రీ సాధన కళాశాలలో శుక్రవారం ఆర్థిక మోసాలు అరికట్టడంపై, నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్



మార్కాపురం వన్‌టౌన్, మార్చి 1: మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన కె.కిరణ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఆడిట్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ఈయన కమిషనర్‌గా మార్కాపురానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ పి.రవీంద్ర ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

ఆర్‌బీకేల్లో కందులు విక్రయించండి : ఏవో

- కొనుగోలు చేసిన మూడురోజుల్లోనే నగదు


రాములవీడు ఆర్బీకేల్లో కందుల కొనుగోలును పరిశీలిస్తున్న ఏవో

పొదిలి, మార్చి 1 : కందిపైరు పండించిన రైతు రైతుభరోసా కేంద్రాల్లో విక్రయించాలని వ్యవసాయాధికారి షేక్ జైనలుబ్దీన్ కోరారు. మండలంలోని రాములవీడు ఆర్‌బీకేలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మిగిలిన రైతుభరోసా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా బహిరంగ మార్కెట్ ధరకే రైతుల వద్ద కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం మూడు రోజుల్లోనే రైతులకు నగదును వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. కావున దళారులను ఆశ్రయించి ధరలో, కాటాలో మోసానికి గురికాకుండా ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. గతంలో మాదిరిగా నగదు ఆలస్యం కాకుండా మూడురోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యో విధంగా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారన్నారు. కనుక అపోహలకు పోకుండా రైతుభరోసా కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


గ్యాస్ కనెక్షన్లతో మహిళలు

పెద్ద దోర్నాల, మార్చి 1 : దోర్నాలలోని శివ మణికంఠ భారత్ గ్యాస్ ఏజన్సీ కార్యాలయంలో ఉజ్వల యోజన పథకంలో భాగంగా గ్యాస్ సిలెండర్లు మంజూరైన వారికి శుక్రవారం సిలెండర్లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఉజ్వల యోజనలో మండలంలోని 26 మంది పేద మహిళలకు బీజేపీ మండల కన్వీనర్ గండి వీరారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఏజన్సీ యజమాని రావిక్రింది లక్ష్మీ నరసింహారావు, సుబ్బరత్నం, బీజేపీ నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యాదీవెన నిధులు విడుదల


చెక్కు అందజేస్తున్న చైర్మన్ వెంకటసుబ్బయ్య

గిద్దలూరు, మార్చి 1 : గిద్దలూరు ప్రాంతం లోని వసతిగృహాల్లో ఉం డి చదువుకుంటున్న వి ద్యార్థులకు జగనన్న విద్యాదీవెన మొదటి విడత నిధులు విడు దలయ్యాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో 6049 మందివిద్యార్థులకు మంజూరైన రూ.3.79 కోట్ల నిధులను మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య వసతిగృహ వార్డెన్లకు నమూనా చెక్కును అందజేశారు. వారి అకౌంట్లలో జమ చేయనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో షేక్ జబ్బార్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ


అట్టలు పంపిణీ చేస్తున్న కండక్టర్ శంకర్

గిద్దలూరు, మార్చి 1 : నిత్యం తాను విధులు నిర్వహించే ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి చదువుకొని వచ్చే 31 మంది 10వ తరగతి విద్యార్థులకు గిద్దలూరు ఆర్టీసి డిపో కండక్టర్ శంకర్ నాయుడు పరీక్ష అట్టలను, విద్యా ఉపకరణాలను అందజేశారు. రెట్టపల్లి గ్రామానికి చెందిన 31 మంది 10వ తరగతి విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సులో బేస్తవారపేటకు వచ్చి చదువుకుంటారు వీరందరికీ కండక్టర్ శంకర్ నాయుడు విద్యాసామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్ శాయన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెలిప్యాడ్ స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

పెద్దదోర్నాల, మార్చి 1: వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఈ నెల మొదటివారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రానున్న నేపథ్యంలో హెలీప్యాడ్‌ను ఏఎస్పీ నాగేశ్వర రావు శుక్రవారం పరిశీలించారు. అంతకు ముందు కొత్తూరు వద్ద నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టులోని కీలకభాగాలు రెండు సొరంగాలను సందర్శించారు. ఆయన వెంట ఎర్రగొండపాలెం సీఐ రాములునాయక్, కంభం సీఐ రామకోటయ్య, ఎస్సై అంకమరావు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏపీజీబీ మేనేజర్ సంజీవయ్య

ప్రతి వ్యక్తికీ ఆర్థిక అక్షరాస్యత అవసరం

- ఏపీజీబీ మేనేజర్ సంజీవయ్య

తాళ్లూరు, మార్చి 1 : ప్రతివ్యక్తికి ఆర్థిక అక్షరాస్యత ఎంతో ముఖ్యమని బొద్దికూరపాడు ఆంధ్రాప్రగతి గ్రామీణబ్యాంక్ మేనేజర్ వి.సంజీవరావు అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక నిర్దిష్ట సొమ్మును పొదుపుచేసి తర్వాత మిగిలిన వారికి ఉపయోగిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. బ్యాంకులో వ్యక్తిగత, విద్య, గృహ నిర్మాణం, వ్యవసాయం, వాహనాల కొనుగోలుతో పాటు వ్యాపార అభివృద్ధికి ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులను 5గ్రూపులుగా విభజించి ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో హరితగ్రూప్ ప్రథమస్థానం, కేశవ గ్రూప్ ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకుబ్యాంక్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వి.వెంకటేశ్వర్లు, పీసీ చైర్మన్ వై.కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ పులి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, రిటైర్డ్ బ్యాంక్ అధికారి ఎస్.యోగిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


గోపాలపురంలో బాబు ష్యూరిటీ పత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

పామూరు, మార్చి 1 : వైసీపీ పాలనలో అధోగతి పాలైన ఆంధ్రరాష్ట్రం టీడీపీ అధికారంలోకి వస్తేనే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని టీడీపీ పట్టణకమిటీ ఎన్నికల చైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ తెలిపారు. పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. మండలంలోని పామూరు, కంభాలదిన్నె, రావిగుంటపల్లి, కందులవారిపల్లి, తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, పాలపర్తి వెంకటేశ్వర్లు, అబ్బారెడ్డి రాజా, పెంచలయ్య, పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పందిటి హరీష్, మెంటా నరసింహారావు, ఎం దొరబాబు, పెసల నరసింహారావు, మన్నం రమణయ్య, గట్ల కొండారెడ్డి, మన్నే నరసింహులు ఎం. రమాదేవి, గుత్తి మహి పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటస్వామి

ఈ-పంట నమోదులో తప్పుల సవరణ

పీసీపల్లి,మార్చి1:ఈ ఏడాది రబీలో రైతులు సాగుచేసిన పంటలను ఈ-పంట నమోదు చేశామని వ్యవసాయ అధికారి జి.వెంకటస్వామి అన్నారు. తలకొండపాడు ఆర్బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్బీకేలలో ఈ-పంట నమోదు జాబితాలను ప్రదర్శించామన్నారు. వాటిని రైతులు సరిచూసుకుని ఆధార్‌నెంబరు, పంట పేరు, సర్వేనెంబరు, విస్తీర్ణం, రైతుపేరు తదితర వివరాలలో ఏమైనా తప్పుగా నమోదై ఉంటే వీఏఏల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ఆర్బీకేల పరిధిలో కందులను పౌరసరఫరాలశాఖ ద్వారా మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తామని చెప్పారు.


చలివేంద్రం ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చలివేంద్రం ప్రారంభం

దర్శి, మార్చి 1 : స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించటం ఆనందదాయకమన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనులకు ఇక్కడకు వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజల దప్పిక తీర్చేందుకు గడియార స్తంభం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి తహసీల్దార్ సుజాత, రోటరీక్లబ్ అధ్యక్షుడు ఎస్ తిరుపతిరెడ్డి, సభ్యులు సోము దుర్గారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు


రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్, వైద్యులు

ప్రజారోగ్యం కోసమే ఆరోగ్యసురక్ష

తాళ్లూరు, మార్చి 1 : రాష్ట్రంలోని పేద ప్రజలందరూ ఆరోగ్య వంతులుగా ఉండేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి అన్నారు. విఠలాపురం గ్రామ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే జరిపి వ్యాధిగ్రస్తులను గుర్తించటం, శస్త్రచికిత్సలు అవసరమైనవారికి జిల్లా వైద్యశాలలకు పంపటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జాన్సీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ శంఖారావం సభకు ఏర్పాట్లు

పరిశీలించిన టీడీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

విజయవంతం చేయాలని నేతలు, కార్యకర్తలకు పిలుపు

పామూరు, మార్చి 1 : టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జిల్లాలో తల పెట్టిన శంఖారావం కదలిరండి తెలుగుదేశం కార్యకర్తలారా ప్రోగ్రాం ఈ నెల మొదటి వారం కనిగిరి నియోజకవర్గంలోని పామూరులో జరుగుతుందని, నియోజకవర్గ టీడీపీలోని అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శంఖారావ సభ పామూరులోని తూర్పు బైపాస్ పక్కన సభా స్థలి ప్రాంగణంలో జరుగుతున్న పనులను టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. సభావేదిక, హెలిప్యాడ్, లోకేష్ సభా వేదికకు వచ్చే దారి, టీడీపీ శ్రేణులు వచ్చే దారి, భోజనాలు, పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. లోకేష్ పర్యటనకు సంబంధించిన పలు వివరాలను ఉగ్ర తెలిపారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల్లో టాప్‌టెన్‌లో నిలిచిన బూత్ కమిటీ ఇన్‌చార్జులతో లోకేష్ ముఖాముఖి ఉంటుందని, శివరాత్రి లోపు టార్గెట్‌లను అధిగమించాలని సూచించారు. శంఖారావం సభకు సుమారుగా 10 వేల మంది హాజరు అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు, టీడీపీ పట్టణ గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, పట్టణఎన్నికల కమిటీ చైర్మన్ డీవీ మనోహర్, పట్టణ ఫోర్ మెన్‌కమిటీ సభ్యులు షేక్ గౌస్‌బాషా, ఇర్రికోటిరెడ్డి, పందిటి హరీష్, ముబినామౌలాలి, దేవరపు మాల్యాద్రి, కోటపాటి శ్రీచరణ్, పోకా నాయుడుబాబు, ఎన్. నాగేంద్రచారి, జి. శ్రీనివాసులు, తిరుపతయ్య, మెంటా నరసింహారావు, గుత్తి మహేష్, మండ్లా రమణయ్య పి. నరసింహారావు, ఇర్రి శ్రీనివాసులురెడ్డి, కోటపాటి రాము, ఎస్.నరసింహారావు, దొరబాబు, ఏ రాజా, పి. హరి పాల్గొన్నారు.


నాయకులతో కలిసిన లోకేష్ శంఖారావ కార్యక్రమ సభా స్థలిని పరిశీలిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దుచేయాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితుల ధర్నా

పీసీపల్లి,మార్చి1: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములను కొందరి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపిస్తూ మండలంలోని కోదండరామపురం, మెట్లవారిపాలెం గ్రామాలకు చెందిన బాధితులు వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. వ్యవసాయ కార్మికసంఘం నాయకులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పెదయిర్లపాడు రెవెన్యూలోని 1129/5, 1101/3, 1129/6, 1129/7, 1101/5, 1101/9, 1101/4, 1104/3, 1101/7, 1101/2, 1101/6, 1101/8, 1104/1, 1129/2 తదితర సర్వేనెంబర్లలో 22మంది దళితులకు 1994వ సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా ప్రభుత్వం భూములను ఇచ్చింది. అందులో అప్పట్లో ఆరు బావులను కూడా ప్రభుత్వమే తవ్వించింది. కొన్నేళ్ల తరువాత శింగరాయకొండ ప్రాంతాలకు చెందిన కొంతమంది కౌలుకు రాయించుకుని భూములు సాగుచేశారు. అయితే తమకు రుణాలు ఇప్పిస్తామని పట్టాలు పొందిన మహిళలతో వేలిముద్రలు వేయించుకుని అక్రమంగా వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు నిరుపేదలకు ఇచ్చిన భూములను ఆక్రమిస్తున్నారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దుచేసి తిరిగి దళితులకు భూమిని అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు .అనంతరం ఆ సమయంలో కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో కార్యాలయ ఉద్యోగినికి బాధితులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో మహేష్, బడుగు వెంకటేశ్వర్లు, పెదబాలయ్య, చినబాలయ్య, మార్కండేయులు, రాగి మాల్యాద్రి, లక్ష్మమ్మ, మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ వివరణ

ఈ భూముల విషయమై పీసీపల్లి తహసీల్దార్ పద్మావతిని వివరణ కోరగా బాధితులు ఇచ్చిన వినతిపత్రంపై విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

దర్శిలో ఆరు కేంద్రాల్లో నిర్వహణ

దర్శి, మార్చి 1 : దర్శిలో ఆరు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దర్శి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, లయోలా కళాశాల, గౌతమీ జూనియర్ కళాశాల, గీతాంజలి కళాశాల, డీవీఎస్ కళాశాల, ర్యూస్సీ కళాశాలల్లో మొత్తం 1150 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం తొలిరోజు పరీక్షలు ప్రశాతంగా ముగిశాయి.


దర్శిలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న ఇంటర్ విద్యార్థులు

పామూరులో 60 మంది గైర్హాజరు

పామూరు : ఇంటర్ పరీక్షలు తొలిరోజు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైనాయి పామూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 354 మందికి గాను 35 మంది, ఆదిత్య జూనియర్ కళాశాల సెంటర్‌లో 374 కు గాను 25 మంది పరీక్షలకు గైర్హాజరయినట్లు డిపార్ట్‌మెంట్ అధికారులు పీవీ నారాయణ, వి. రవీంద్ర తెలిపారు. చీఫ్ అధికారులుగా జీజేసీ ప్రిన్సిపాల్ కె. సురేష్, ఆదిత్య ప్రిన్సిపాల్ ఆర్. నాగరాజులు వ్యవహరించారు. కాగా తొలిరోజు పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్ పాండురంగ విఠల్ కేంద్రాలను తనిఖీ చేశారు.


తాళ్లూరు ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

సీసీకెమెరాల పర్యవేక్షణలో..

దొనకొండ : దొనకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. దొనకొండ, కురిచేడు మండలాలకు చెందిన 116 మంది విద్యార్థులకు గాను 88 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం ఐదు గదులతో సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాటు చేసినట్లు పరీక్షల చీఫ్ షేక్ ఖాదర్‌వలి తెలిపారు. ఈ పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారిగా ఎస్.చెన్నయ్య వ్యవహరించగా శుక్రవారం స్క్వాడ్ అధికారి డి.ఆంజనేయులు బృందం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు.

తాళ్లూరులో

తాళ్లూరు : తాళ్లూరు ఊటుకూరు కోటయ్య జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలు ప్రశాంతంగాప్రారంభమయ్యాయి. తాళ్లూరు జూనియర్ కళాశాల,తాళ్లూరు, ముండ్లమూరు కేజీబీవీ విద్యార్థులు పరీక్షలు ఆస్తున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 89 మంది విద్యార్థులకు గాను 82 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎలాంటి కాపీయింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల చీఫ్ వై.గురవయ్య తెలిపారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

వెలిగండ్ల, మార్చి 1 : పొగాకు క్యూరింగ్ చేస్తుండగా బ్యారన్ నుంచి మంటలు చెలరేగి రెండు బ్యారన్లు దగ్ధమయ్యాయి. వెలిగండ్ల గ్రామానికి చెందిన అనిచెట్టి చౌడయ్య బాపనపల్లి గ్రామంలో పొగాకు బ్యారన్ అద్దెకు తీసుకొని పొగాకు క్యూరింగ్ చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం పొగాకు క్యూరింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో బ్యారన్లోని పొగాకు పూర్తిగా కాలిపోవడంతో పాటు పక్కనే ఉన్నటువంటి మరో బ్యారన్ కూడా కాలిపోయింది. స్థానికులు అందించిన సమాచారంతో కనిగిరి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు రూ. 8 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.


కాలిపోతున్న బ్యారన్లు

పల్నాడు జిల్లాలో వెంకటరావు మృతదేహం

దర్శి, మార్చి 1 : గత కొన్నిరోజులుగా కనిపించకుండా పోయాడని భావిస్తున్న మండలంలోని పెద్ద ఉయ్యాలవాడకు చెందిన దిద్ది వెంకటరావు(34) శవమై పల్నాడు జిల్లాలో కనిపించాడు. వెంకటరావు గత కొద్దిరోజులుగా కనిపించకపోవటంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్శి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం కోసం పోలీసులు వివరాలు సేకరిస్తుండగా పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, పొందుగల గ్రామ శివార్లల్లో వెంకరావు మృతదేహం రెండు రోజుల క్రితం లభ్యమైంది. అక్కడి పోలీసులు శవాన్ని పరిశీలించి ఎవరో హత్య చేసి ఉంటారని భావించి కేసు నమోదు చేశారు. దర్శి పోలీసులకు సమాచారం అందటంతో వెళ్లి పరిశీలించగా మృతదేహం వెంకటరావుది అని గుర్తించారు. వెంకటరావు హత్యకు కారణాలపై పోలీసులు దృష్టి సారించారు. ఆర్థిక లావాదేవీలే ప్రధాన కారణమని భావిస్తున్నారు.


వెంకటరావు మృతదేహం

బాధితుడికి టీడీపీ మండల అధ్యక్షుడి సహాయం

దొనకొండ, మార్చి 1 : అనారోగ్యానికి గురై గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన చింతగుంట్ల దుర్గారావుకు మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్లా వెంకటనారాయణ, పోలు ప్రకాశం, కట్టకిందపల్లి గ్రామస్థులు కాటే బాలాజీ, కాటే చెన్నకేశవులు, కాటే వెంకటేశ్వర్లు, చింతగుంట్ల శేషులు తదితరులు ఉన్నారు.


వైద్య ఖర్చుల నిమిత్తం దుర్గారావుకు నగదు అందిస్తున్న టీడీపీ నాయకులు

వలంటీర్లకు సన్మానం

పామూరు, ఫిబ్రవరి 1 : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఒకటవ గ్రామ సచివాలయంలో సర్పంచ్ అల్లూరి రాగమ్మ శుక్రవారం పలువురు వలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వి. బ్రహ్మానందరెడ్డి, ఓగూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి మృతికి యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నేతల సంతాపం

తాళ్లూరు, మార్చి 1 : శివరాంపురం జనరల్ పాఠశాలలో పని చేస్తున్న సెంకడరీగ్రేడ్ ఉపాధ్యాయుడు ఎస్.సుబ్బారెడ్డి అకాలమృతికి ఎంఈవో జి.సుబ్బయ్య, యూటీఎఫ్‌ఎఫ్, ఏపీటీఎఫ్ నేతలు సంతాపం తెలిపారు. సుబ్బారెడ్డి మృతదేహాన్ని శుక్రవారం సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి తమ ప్రగాఢసంతాపం తెలిపారు. ఉపాధ్యాయ సంఘనేతలు జవహర్,నాగిరెడ్డి,జగదీశ్వరి, శ్రీనివాస్,వెంకటేశ్వరరెడ్డి, అరుణ తదితరులు ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టండి

పామూరు, మార్చి 1 : వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీ రమణయ్య అన్నారు.ప్రజాపోరు యాత్ర కార్యక్రమాన్ని మండలంలోని నుచ్చుపొద, ఇనిమెర్ల, లక్ష్మీనరసాపురం, బొట్లగూడూరు, కమ్మవారిపాలెం, కంభాలదిన్నె గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జె. చిన సుబ్బయ్య, కిసాన్ మోర్చ అధ్యక్షులు చుంచు కొండయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చింతగుంపల్లిలో ఆరోగ్యసురక్ష కార్యక్రమం

పీసీపల్లి,మార్చి1:మండలంలోని చింతగుంపల్లి సచివాలయంలో శుక్రవారం ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 378 ఓపీలు రాగా వీరిని వైద్యులు పరీక్షించి మందులను అందజేశారు.17మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.మంజుల, డాక్టర్ ప్రద్యుష్ కిరణ్, హెచ్‌వీ రేణుకాదేవి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

పామూరు, ఫిబ్రవరి 1 : అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని సీడీపీవో పి. సరోజిని సూచించారు. మండలంలోని బొట్లగూడూరు, గంగానగర్ మోపాడు ఎస్సీకాలనీ, బొంపెద్దు పాడు, అప్పమాంబాపురం, కంభాలదిన్నె ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు,

మినీ కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ

పామూరు, మార్చి 1 : పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులోగల శ్రీ కోదండ రామ స్వామి దేవస్థాన ఆవరణలో నవగ్రహ శివాలయం, మినీ కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ శుక్రవారం నిర్వహించారు. ముందు గా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షులు గాయకవాడ సురేష్ దంపతులు, శివాజీ దంపతులు, యేల్చూరి రామారావు, గాదం శెట్టిసత్యం దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


మినీ కల్యాణ మండపం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న నిర్వహకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

కనిగిరి, మార్చి 1: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో జాన్‌ఇర్విన్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లపట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. పేదలకిచ్చిన ఇంటిస్థలంలో తప్పని సరిగా నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటిని నిర్మించుకోవటానికి వివిధ రూపాల్లో ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, తహసీల్దార్ సురేష్, సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

పీసీపల్లి ఎంపీడీవోగా సుబ్బారావు

పీసీపల్లి,మార్చి1:పీసీపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఏవీ సుబ్బారావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.ఆ మేరకు ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. ఈయన నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలో ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీలో భాగంగా పీసీపల్లికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.శ్రీనివాసరెడ్డి బాపట్ల జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024
5





సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కుర్చీలు, బారికేడ్లు



సభా వేదికను పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, గొట్టిపాటి రవికుమార్ తదితరులు

రా కదలిరాకు..
సర్వం సిద్ధం

- నేడు దాచేపల్లిలో బహిరంగ సభ
- సభ విజయవంతానికి నేతల కృషి
- ఎంపీ లావు, మక్కెన టీడీపీలో చేరిక
- దాచేపల్లిలో చంద్రబాబు బసకు ఏర్పాట్లు

పిడుగురాళ్ల, దాచేపల్లి, మార్చి 1: గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో శనివారం జరిగే రా.. కదలిరా సభకు టీడీపీ నాయకులు సర్వం సిద్ధం చేశారు. సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. దాచేపల్లిలో నార్కెట్‌పల్లి ప్రధాన రహదారి పక్కన రా.. కదలిరా సభకు ఏర్పాట్లు చేశారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు కంకణం కట్టుకున్నారు. ఈ సభకు లక్షమందికి పైగా జనం తరలివస్తారని అంచనా వేసి ఆ స్థాయిలో ఏర్పాట్లు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలు సభకు హాజరుకానున్నారు. భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సభ ద్వారా టీడీపీ, జనసేన శ్రేణులను చంద్రబాబు ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. రా.. కదలిరా సభ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చంద్రబాబు సమక్షంలో సభా వేదికపై టీడీపీలో చేరనున్నారు. వారి అనుచరులు, పలువురు వైసీపీ నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా టీడీపీ కండువా కప్పుకుంటారని నాయకులు తెలిపారు. అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన తర్వాత చంద్రబాబు జిల్లాకు వస్తుండటంతో అధినేత పర్యటనను విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేశారు. అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా టీడీపీ, జనసేన శ్రేణులు, అభిమానులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారికి భోజనం, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాలను ఎంపిక చేశారు. సభా ప్రాంగణానికి ఇటు పిడుగురాళ్ల, అటు పొందుగల వైపు పార్కింగ్ స్థలాలు కేటాయించారు. శుక్రవారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, యరపతినేని శ్రీనివాసరావు తదితరులు సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు.



చురుగ్గా సాగుతున్న హెలిపాడ్ నిర్మాణ పనులు

దాచేపల్లి పసుపుమయం

రా కదలిరా సభతో దాచేపల్లి పసుపుమయమైంది. దాచేపల్లి పట్టణం అంతా ఫ్లెక్సీలు, టీడీపీ, జనసేన జెండాలతో నిండిపోయింది. ప్రధాన రహదారి కూడా పసుపుమయంగా మారింది. హెలిప్యాడ్ నుంచి సభావేదికకు వెళ్లే రహదారికి ఇరువైపులా చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం వద్ద సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నేతృత్వంలో ఒక్క గురజాల నియోజకవర్గం నుంచే 60 వేల మందికి పైగా తరలివస్తారని అంచనా. వ్యవధి తక్కువగా ఉన్నప్పటికీ వేదిక, జనసమీకరణకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను యరపతినేని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

లక్ష మందితో సభ : యరపతినేని

దాచేపల్లిలో శనివారం జరిగే రా.. కదలిరా బహిరంగసభకు లక్ష మంది హాజరవుతారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆత్మగౌరవ యాత్ర స్ఫూర్తితో ఆనాడు టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఆ మాదిరిగానే రా.. కదలిరా సభతో వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి టీడీపీ వస్తుందని తెలిపారు. ఐదేళ్లపాటు వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులు పడిన ఇబ్బందులు, అవమానాలను కసిగా మార్చుకుని నేడు చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా తరలిరానున్నారన్నారు.

దాచేపల్లిలోనే చంద్రబాబు బస

సభ అనంతరం చంద్రబాబు దాచేపల్లిలోనే రాత్రి బస చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. తొలుత అనుకున్న విధంగా మధ్యాహ్నం 2 గంటలకు కాకుండా సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం కానున్నది. దీంతో సభ పూర్తయ్యే సరికి రాత్రి అవుతుంది. ఆ సమయంలో హెలికాప్టర్‌లో చంద్రబాబు వెళ్లే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ఆయన ప్రత్యేక బస్సులో రాత్రి బస చేసి ఆదివారం ఉదయం వెళ్లేలా కార్యక్రమం రూపొందించారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం ఉదయం 10 గంటలలోపు చంద్రబాబు తిరిగి హెలికాప్టర్ ద్వారా వెళ్లనున్నారు. ఈ క్రమంలో ఎన్నికలపై ఆయన ఆదివారం ఉదయం ఉమ్మడి గుంటూరు నేతలతో చర్చించే అకాశం ఉంది.



ముస్తాబవుతున్న సభా వేదిక

హైవేపై ఘోరం.. ముగ్గురు మృతి

- డ్రైవర్ సహా మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- క్షతగాత్రులందరూ ఒకే కుటుంబీకులు.. మంగళగిరిలో విషాదం
- జూలకల్లులో బంధువుల శుభకార్యానికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన



గార్లపాటి సుబ్బమ్మ



గార్లపాటి శ్యామ్ దీక్షిత్



గార్లపాటి పావని

గుంటూరు, మంగళగిరి సిటీ, మార్చి 1: వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా గుంటూరు శివారు జాతీయ రహదారిపై బొంతపాడు సమీపంలో గురువారం అర్ధరాత్రి (శుక్రవారం తెల్లవారు జామున) దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించి పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు.. మంగళగిరిలోని గండాలయ్యపేటకు చెందిన స్వర్ణకారవృత్తిదారుడైన గార్లపాటి రామకృష్ణ కుటుంబసభ్యులు పిడుగురాళ్ల మండల పరిధిలోని జూలకల్లులో బంధువుల వివాహానికి వెళ్లారు. రామకృష్ణ తనకు తెలిసిన వారి వద్ద కారు తీసుకుని మంగళగిరికి చెందిన ఏకుల శ్రీకాంత్‌ను డ్రైవర్‌గా తీసుకెళ్లారు. కారులో రామకృష్ణ తల్లి సుబ్బమ్మ (48), ఆమె తోడికోడళ్లు నాగలక్ష్మి, రాధా, నాగలక్ష్మి కూతురు పావని (17), రామకృష్ణ కుమారుడు శ్యాంబాబు(8), డ్రైవరు శ్రీకాంత్ మొత్తం ఆరుగురు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు పెళ్లికి వెళ్లారు. వివాహం అనంతరం రాత్రి 10 గంటల సమయంలో వారు అదే కారులో గుంటూరు మీదగా మంగళగిరి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు గుంటూరు సమీపంలోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో బొంతపాడు అడ్డరోడ్డు వద్దకు వచ్చే సరికి ముందు కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కును కుడివైపున వెనుక నుంచి అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఎడమ వైపు కూర్చొన్న సుబ్బమ్మ, పావని, శ్యాంబాబు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆ సమయంలో రాత్రి గస్తీలో ఉన్న ప్రత్తిపాడు సీఐ నిసార్‌బాషా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో జీజీహెచ్‌కు తరలించారు. నాగలక్ష్మి, డ్రైవర్ శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాధ భర్త శ్రీను జీజీహెచ్‌కు చేరుకున్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణంతో శుక్రవారం జీజీహెచ్ మార్చురీ వద్దకు మంగళగిరికి చెందిన మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో మంగళగిరి గండాలయపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

లోకేశ్ దిగ్భ్రాంతి..

రోడ్డు ప్రమాదంలో మంగళగిరికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు జగ్గారపు రామమోహనరావు, నల్లగొర్ల రామకృష్ణ, బాపనపల్లి వాసు తదితరులు మృతదేహాలకు నివాళులు అర్పించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

7న దోనేపూడికి చంద్రబాబు

- తిరుపతమ్మ ఆలయం ఎదుట ప్రజాగళం సభ
- స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి ఆనందబాబు



చంద్రబాబు బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు, మార్చి 1: టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలిరా సభలు ఈ నెల 4న అనంతపురం జిల్లా రాప్తాడులో ముగుస్తాయి. ఆ తర్వాత ప్రజాగళం పేరుతో బహిరంగ సభలను టీడీపీ రూపొందించింది. ఐదు రోజుల పాటు ఈ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వేమూరు, బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో ప్రజాగళం బహిరంగసభను ఏర్పాటుచేశారు. శుక్రవారం మాజీ మంత్రి, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు దోనేపూడిలో నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఎదుట ఉన్న ఏడెకరాల ఖాళీ స్థలం సభకు అనువుగా ఉంటుందని ఎంపికచేశారు. సభా వేదిక, కార్యకర్తల కోసం భోజనం, పార్కింగ్ ఏర్పాట్లకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని నాయకులు ఆనందబాబుకు వివరించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా బహిరంగ సభ నిర్వహించుకోవచ్చని తేల్చారు. హెలిప్యాడ్, సభా వేదిక పరిశీలన కోసం ఆదివారం టీడీపీ బృందం పర్యటిస్తుందని, వారి సూచనలకు అనుగుణంగా ఖరారు చేస్తామని ఆనందబాబు తెలిపారు. దోనేపూడి గ్రామంలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు 7న ఉదయం 11 గంటలకు చంద్రబాబు చేరుకుంటారన్నారు. అనంతరం చంద్రబాబు అదే రోజున రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో జరిగే సభల్లో పాల్గొంటారన్నారు. ఆయా సభల్లో టీడీపీ, జనసేన నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, నాయకులు వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్‌బాబు, సుంకర రామమోహనబాబు, గుమ్మడి సాంబశివరావు, బుర్రి జగన్, మున్నంగి విజయ్‌కుమార్, పెదపూడి నాగరాజు, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర శ్రీను, ధూళిపూడి కృష్ణ, యడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదల రిజిస్ట్రేషన్లు
పెండింగ్

- తిప్పుకుంటున్న సచివాలయ సిబ్బంది
- మున్సిపల్ కమిషనర్ హెచ్చరించినా మారని తీరు

బాపట్ల, మార్చి 1: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా జగనన్నకాలనీల్లో స్థలాలిచ్చి వాటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్లు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్నది. అయితే అది ప్రచారానికే పరిమితమవుతోంది. జిల్లాలోని జగనన్న కాలనీల్లో 47,738 మంది లబ్ధిదారులకి పట్టాలిచ్చారు. వాటిల్లో 42,449 పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన 5,289 పట్టాలు నేటికీ రిజిస్ట్రేషన్ కాలేదు. రిజిస్ట్రేషన్ల కోసం సచివాలయాల చుట్టూ మహిళలు రోజులు తరబడి తిరుగుతున్న సిబ్బంది సరైన సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నారని పలువురు వాపోతున్నారు. బాపట్ల ఇస్లాంపేటలోని గుంటూరువారి వీధి రాగూర్‌స్కూల్‌లోని సచివాలయ సిబ్బంది నిత్యం లబ్ధిదారులను తిప్పుకుంటున్నారు. వీరిపై పలువురు మున్సిపల్ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ సచివాలయ సిబ్బందిని హెచ్చరించినా వారి తీరులో ఏ మాత్రం మార్పులేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇక పలు ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్ల సమయంలో అనేక తప్పులు వెలుగుచూస్తున్నాయి. సర్వేనెంబరు సరిగ్గా లేక పోవడం, హద్దులు ఇష్టానుసారంగా ఉండటం వంటి కారణాలతో అనేకమంది లబ్ధిదారుల స్థలాలు రిజిస్ట్రేషన్ కాలేదు. కొన్నిచోట్ల ఏకంగా లేఅవుట్‌లే తప్పులు ఉన్నట్లు తేలింది.

ఇవ్వని స్థలాలు ఇచ్చినట్లుగా..

లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రచారం చేసుకున్నారు. ఆ సమయంలో వారిచ్చిన బుక్‌లెట్లలో లబ్ధిదారుల పేరుతో స్థలాల వివరాలున్నాయి. ఆ బుక్‌లెట్లలో స్థలం మంజూరైంది.. త్వరలో ఇల్లు కూడా మంజూరు చేసి సొంత ఇంటి కల నెరవేరుస్తామని ముద్రించారు. దీనిని చూసిన పలువురు లబ్ధిదారులు తమకు ఇంకా స్థలమే ఇవ్వలేదు.. ఇల్లు ఎక్కడ కడతారని ప్రశ్నిస్తున్నారు. తర్వాత స్థలం ఇస్తామని అప్పట్లో నాయకులు చెప్పగా లబ్ధిదారులు అప్పటి నుంచి అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారు. అయితే ఇంతవరకు వారికి స్థలం చూపలేదు. అదేమిటని ప్రశ్నిస్తే లేఅవుట్‌లో ఖాళీలు లేవని అధికారులు చెప్తున్నారు. కొన్ని లేఅవుట్లలో స్థలాలు ఖాళీగా ఉన్నా వాటిని పంపిణీ చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. అర్హతగల వారిని గుర్తించి వారికి 90 రోజుల్లో నివేశన స్థలాలిస్తామని ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. దీంతో అనేకమంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులతో జాబితాలు కూడా రూపొందించారు. నెలలు గడిచినా వారికి స్థలాలివ్వకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో స్థలాలిచ్చే కార్యక్రమం అటకెక్కినట్లేనా అని లబ్ధిదారులు వాపోతున్నారు.



బాపట్ల మండలం ఈతేరులో ఓ లబ్ధిదారుడికి స్థలం ఇచ్చినట్టు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన బుక్‌లెట్



బాపట్ల పట్టణంలోని జగనన్న కాలనీలో వసతులు లేని గృహాలు

తొలిరోజు హాజరు..
94.63 శాతం

- జిల్లాలో ప్రశాంతంగా జూనియర్ ఇంటర్ పరీక్షలు
- దివ్యాంగు విద్యార్థులకు ప్రత్యేక పరీక్షా కేంద్రం : డీవైఈవో

బాపట్ల టౌన్, మార్చి 1: జిల్లాలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సంస్కృతం, తెలుగు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలోని 35 కేంద్రాల్లో 94.63 శాతం హాజరు నమోదైంది. 9548 మంది విద్యార్థులకు 9036 మంది హాజరయ్యారు. నిర్ణీత సమయానికి అరగంట ముందుగా విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. హైపవర్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేశాయి. ఇంటర్ మీడియట్ పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగుల కోసం బాపట్లలోని బధిరుల ఆశ్రమ కళాశాలలో ప్రత్యేక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు డీవైఈవో పి.యర్రయ్య తెలిపారు. వెబ్ సైట్‌లో హాల్ టిక్కెట్లను అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎస్పీ

పరీక్షా విధుల్లో నిర్వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. బాపట్లలోని బాపట్ల జూనియర్ కాలేజి, శ్రీచైతన్య, సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికలల కళాశాలల పరీక్షా కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నామని, ఆయా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బందిచే బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.



ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

అద్దంకిటౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి అద్దంకిలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 998 మంది విద్యార్థులకు గాను 920 మంది హాజరయ్యారు. 78 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శ్రీప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాల, శ్రీసాధన గోవిందాంబికా పరమేశ్వరి జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

పర్చూరు: పర్చూరులోని భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 21 మంది గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ చింపారెడ్డి తెలిపారు. 123 మందికిగాను 102 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన పోలీసు బందోబస్తును ఎస్సై ఎస్.రమేష్ పర్యవేక్షించారు.

ఇంకొల్లు: ఇంటర్మీడియట్ పరీక్షల తొలిరోజు పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. డీఎస్ఎం జూనియర్ కాలేజిలో 192 మందికి గాను 189 మంది పరీక్షకు హాజరయ్యారు. డ్రీమ్స్ జూనియర్ కాలేజిలో 270 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 19 మంది గైర్హాజరయ్యారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, మార్చి 1: మండలంలోని రామాంజనేయపురంకు చెందిన లారీ డ్రైవర్లు దాసరి ప్రసాద్, దాసరి కిషోర్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదే గ్రామంలో కుంచాల గోపి అనే టీడీపీ కార్యకర్త ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. సూరేపల్లి గ్రామంలో గుర్రాల వీరరాఘవమ్మ మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, తదితరులు ఉన్నారు.

అద్దంకి: మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు, బొమ్మనంపాడు పంచాయతీ 10వ వార్డు మెంబర్ మలాది నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కరి సత్యనారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేడు పది గ్రామాల నేతలతో గొట్టిపాటి సమావేశం

బల్లికురవ, మార్చి 1: బల్లికురవ మండలంలోని పది గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, వేమవరం, కె.రాజుపాలెం, కొణిదెన, గంగపాలెం, పాతమల్లాయపాలెం, బల్లికురవ, కొండాయపాలెం, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్‌లు, ఓటర్ నేస్తం పేజీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


సచివాలయంలో పథకాల ప్రదర్శనను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

చీరాలటౌన్, మార్చి 1: ప్రభుత్వ పథకాలను రైతులకు పారదర్శకంగా అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం చీరాల మండల వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ ఎఫ్రాయిమ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మండల పరిధిలోని గవినివారిపాలెం -1 రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పథకాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమతి, ఆర్బీకే చైర్మన్ రమణారెడ్డి, వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరామ క్షేత్రానికి విరాళం

అద్దంకిటౌన్, మార్చి 1: అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో దర్శవరపు ఛారిటీస్ తరపున శుక్రవారం దర్శవరపు వెంకటరావు 93వ జయంతి సందర్భంగా బ్రాహ్మణ ఆరామ క్షేత్రానికి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి సీమ బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు హనుమంతరావు, కార్యదర్శి శివప్రసాద్, నాగరాజు, హరిబాబు, శ్రావణ్, అప్పారావు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడు మృతి


ప్రమాదస్థలిలో మృతి చెందిన సుబ్బారావు

ఇంకొల్లు, మార్చి 1: వరిగడ్డి ట్రాక్టర్, టీవీఎస్ మోటర్‌సైకిల్ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. మార్టూరు మండలం కోలలపూడికి చెందిన సూరగాని సుబ్బారావు ఇంకొల్లు ప్రాంతంలో మోపెడ్‌పై చీపుర్లు అమ్ముకుంటున్నారు. ఈక్రమంలో గంగవరం రోడ్డులో ఓ ఫ్యాక్టరీలో నుంచి బయటకు వస్తుండగా ట్రాక్టర్ మోపెడ్ ఢీకొన్నాయి. ప్రమాదంలో మోపెడ్ నడుపుతున్న సుబ్బారావు(70) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాకర్ రోడ్డు పక్కన ఉన్న మురుగుకాల్వలోకి దూసుకుపోయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై మల్లికార్జునరావు కేసు నమోదు చేసి సుబ్బారావు మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ గాజుల శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

ఇంకొల్లు, మార్చి 1: గర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కొణికి రోడ్డులో అప్పేరు వాగు సమీపంలో జరిగింది. బీహార్ రాష్ట్రం మధ్యపూర్ జిల్లా సల్మాతుల్లి గ్రామానికి చెందిన ఉదయకుమార్ ఇంకొల్లు ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి అప్పేరు వాగు సమీపంలో బైకుపై వెళ్లుతున్న ఉదయకుమార్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైకు మీద ఉన్న మరో బీహార్‌కు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

పర్చూరు, మార్చి 1: హత్యాయత్నంపై పర్చూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. పర్చూరు చెంచుకాలనీలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ నేపథ్యంలో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్.రమేష్ తెలిపిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన నల్లబోతుల గణేష్, ఏడుకొండలు, రాజేష్‌పై అదే కాలనీకి చెందిన మల్లా ఏసురాజుతో పాటు మరో ఆరుగురు దాడిచేసి గాయపరిచారు. క్షతగాత్రులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, మార్చి 1: యద్దనపూడి మండలం గన్నవరంకు చెందిన కొల్లా వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మార్టూరులోని అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఆయన కుమారుడు కొల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేసిన అన్నదానానికి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి వాసవీ క్లబ్ వితరణ

పర్చూరు, మార్చి 1: పర్చూరులోని నేతాజీ వృద్ధాశ్రమానికి వాసవీ క్లబ్, యద్దనపూడి ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ వృద్ధులకు సహకారం అందించటం బాధతగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు బాలసుబ్బారావు, సెక్రటరీ వెంకటరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పర్చూరు, మార్చి 1: పేద విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పర్చూరు మండల విద్యాశాఖాధికారులు పి.వెంకట్రామయ్య, ఎం.సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పిల్లల తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల కోసం గ్రామ సచివాలయాలు, ఎంఈవో కార్యాలయాలను సంప్రదించాలని కోరారు.

అద్దంకిలో ఆక్రమణల జోరు

- ప్రభుత్వ స్థలంపై కన్ను
- ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికానివ్వనని వైసీపీ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ప్రకటన
- ఆచరణలో మాత్రం శూన్యం
- ఆక్రమణదారులు వైసీపీ సానుభూతిపరులు కావటమే మౌనానికి కారణమా..


ఆటోనగర్ సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి ప్రహరీ నిర్మాణానికి ఏర్పాట్లు

అద్దంకి, మార్చి 1: ఎన్నికలు వస్తున్నాయంటే అద్దంకి పట్టణంలో ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డు ఉండదు. ఈక్రమంలో గతంలో జరిగిన ఆక్రమణలు, ప్రస్తుతం జరిగిన ఆక్రమణలన్నీ ఈ కోవలో జరుగుతున్నాయి. ప్రధానంగా శింగరకొండ రోడ్డులో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఒక్కసారిగా కాకుండా అవకాశం వచ్చినప్పుడల్లా అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆక్రమించుకుంటున్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పాణెం హనిమిరెడ్డి అద్దంకిలో ఆక్రమణలపై కథనాలు రావటంతో హడావుడిగా ఆయా స్థలాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి అధికారులను ఉద్దేశించి అద్దంకి పట్టణంలో ఒక్క సెంటు ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అదే సమయంలో అవసరమైతే ప్రభుత్వ భూముల రక్షణకు ఫెన్సింగ్ వేయిస్తాను అన్నారు. కాని ఆచరణలో మా త్రం వేరుగా ఉంది.

గత ఎన్నికల సమయంలో జరిగిన ఆక్రమణల పంథాలోనే ప్రస్తుతం కూడా ఆక్రమణలు జోరందుకున్నారు. ఊరచెరువులో ముందస్తు ప్లాన్‌తో చెరువు భూమి సుమారు రెండు ఎకరాలు వదిలి చెరువు అభివృద్ధి పనులలో కట్ట వేశారు. వైసీపీ నేత కనుసన్నలలో ప్లాట్లుగా వేసి అమ్మకాలు చేస్తున్నారు. అదే సమయంలో ఆటోనగర్ వద్ద మరో రెండు ఎకరాలకు ఆక్రమణదారులు ఎసరు పెట్టారు. ఇది మరవముందే నామ్ రోడ్డు నుంచి ఆటోనగర్ మధ్యలో ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలో 201 సర్వే నెంబర్‌లో సుమారు 2.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా పక్క సర్వే నెంబర్‌లో ఉన్న వ్యక్తులు తమ స్థలంలో చేసే నిర్మాణాలతో పాటు పనిలో పనిగా ఆక్రమించుకునేందుకు ఫెన్సింగ్ వేసేందుకు సిద్ధమై పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న విఆర్ ఓ బాషా వెళ్ళి పనులు నిలిపి వేయించారు. ఇటీవల జరిగిన ఆక్రమణలు కూడా అధికారులు అడ్డుకున్న తరువాత కూడా యథావిధిగా కొనసాగించారు.

ఈక్రమంలోనే ప్రస్తుత ఆ క్రణల ప్రాంతాన్ని కూడా అధికారులు ఏమరపాటుగా ఉన్న సమయాన్ని గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. నిర్మాణాలు చేసిన తరువాత ఎలాగూ అధికారులు తొలగించే సాహసం చేయరనే ధీమాతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నట్లు తెలిసింది. దీనికితోడు ఎలాగు అధికారపార్టీ నేతల అండదండలు ఉండనే ఉంటాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకిలో ఆ కమణలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన శిలాఫలకం ధ్వంసం


శిలాఫలకాన్ని ధ్వంసంచేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బల్లికురవ, మార్చి 1: టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఈసంఘటన కొప్పెరపాడు - వినుకొండ రోడ్డులో చోటుచేసుకుంది. బల్లికురవ మండలం కొప్పెరపాడు నుంచి వినుకొండ ఆర్అండ్‌బీ రోడ్డులో ఆరు కిలోమీటర్ల సింగిల్ రోడ్డును తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2018లో సుమారు రూ.ఆరు కోట్లతో డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గొర్రెపాడు, కూకట్లపల్లి యానాది సంఘం వరకు ఈ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచారు. అప్పట్లో ఈ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా నార్కెట్‌పల్లి రోడ్డులోని కొప్పెరపాడు - వినుకొండ రోడ్డు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ రోడ్డున చూసిన బాటసారులు నిత్యం టీడీపీ ప్రభుత్వం ఎంతో మంచి పని చేసింది, రోడ్డును బాగా అభివృద్ధి పరిచారని అభినందిస్తున్నారు. రోడ్డు పక్కనే శిలఫలకం ఉండటంతో అక్కసుతో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి పూట ఎమ్మెల్యే రవికుమార్ పేరు ఉండటంతో శిలాఫలకాన్ని నేల మట్టం చేశారు. దిమ్మె గోడలు కూడా ముక్కలు ముక్కలు చేసి రోడ్డు పక్కన పడవేశారు. అలాగే, పేర్లు ఉన్న బోర్డును పక్కనే ఉన్న కాలువలోకి పడవేశారు. శిలాఫలకం ధ్వంసం చేసిన విషయం తెలిసిన టీడీపీ నేతలు అక్కడకి చేరి వైసీపీవారే కావాలనే శిలఫలకాన్ని పడగొట్టారని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు వేయటం చేత కాదు గాని, చేసిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ఇలాంటి పనులకు ఒడిగొడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో ఉన్న పలు రోడ్లు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే అభివృద్ధి పరిచారని, చేతనైతే రోడ్ల మరమ్మతులు చేయాలిగాని శిలాఫలకాలను పడగొట్టటం మంచి పద్ధతి కాదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కావాలనే శిలఫలకాన్ని పడగొట్టి ప్రజలలో ఆలజడి సృష్టించేందుకు కొందరు ఈ పనులకు దిగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల పేరుతో పేదలను దోచుకుంటున్న సీఎం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజం


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మేదరమెట్ల , మార్చి 1: ఇళ్ల నిర్మాణాల పేరుతో జగన్ రెడ్డి ప్రభుత్వం పేదలను దోచుకుంటుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయనకు కొంతమంది స్థానికులు సమస్యలను వివరించారు. గ్రామంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు. ఇళ్ళు కట్టుకుంటుకుంటున్న వారికి కూడా పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ళు నిర్మించుకునే వారికి సక్రమంగా బిల్లులు చెల్లించకుండా వైసీపీ పేదలను అప్పులపాలు చేస్తుందని విమర్శించారు. ఇసుక, సిమెంట్‌లో కమీషన్లు తీసుకుంటూ పేదలను దోచుకుంటుందని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ పేదలకు ఉచితంగా ఇసుకను అందిస్తే జగన్ రెడ్డి ప్రభుత్వం ట్రాక్టర్ ఇసుక ధర రూ.10 వేలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్షా 80 వేలు తప్ప జగన్ సర్కార్ గృహనిర్మాణాలకు ఒక్క రూపాయికూడా ఇ వ్వలేదని విమర్శించారు. టిడ్కో ఇళ్ల కోసం గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న పేదలకు ఈప్రభుత్వంలో బ్యాంకుల నుండి నోటీసులు ఎందుకువస్తున్నాయో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. మరో 45 రోజులలో తెలుగుదేశం పార్టీ, జనసేన ప్రభుత్వం ఏర్పాడుతుందని చెప్పారు. పేదలకు రెండు సెంట్లలో నాణ్యమైన ఇళ్ళు కట్టిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

పలువురికి పరామర్శ.. మేదరమెట్ల , మార్చి 1: కొరిశపాడు మండలం పి.గుడిపాడు, తమ్మవరం, అనమనమూరు గ్రామాల్లో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులను, కార్యకర్తలను పరామర్శించారు. ఈసందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో నాయకులు ఐక్యమత్యంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, కొట్టె రవీంద్ర, మందా నాగేశ్వరరావు, మందా ఆమోసు, కరిచేటి రాంబాబు, రంపతోటి గోపి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి


ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారులు

చినగంజాం, మార్చి 1: క్రీడల్లో ఓడినా గెలిచినా క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకటసుబ్బారావు అన్నారు. సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు సభ్యులకు శుక్రవారం క్రీడా దుస్తులను అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య సమకూర్చిన క్రీడాదుస్తులను వెంకటసుబ్బారావు పంపిణీ చేశారు. గతనెల 27న పాకల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టుకు 18 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసినట్లు పుల్లయ్య తెలిపారు. వీరికి ఫిబ్రవరి 28, 29, మార్చి 1వ తేది వరకు చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణలో ప్రతిభ చూపిన 12 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 3 నుంచి 5 వరకు విశాఖపట్నంలో జరిగే 70వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరుపున వీరు పాల్గొంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కుర్రి శ్రీనివాసరావు, పీడీ ముంగర సురేష్, ఉపాధ్యాయులు సిద్దం నాగమల్లేశ్వరరావు, పల్లపోలు లక్ష్మీనారాయణ, అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు వివరాలు.. ఎం.తిరుపతిరెడ్డి(కెప్టెన్), సి.అనిల్, టి.సాయిబాబు, జి.లక్ష్మారెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, జి.తేజారెడ్డి, ఎన్.నరేంద్రరెడ్డి, పి.బాలకృష్ణారెడ్డి, కె.వెంకటేష్, వై.రాజశేఖర్‌రెడ్డి, బి.యశ్వంత్, ఎస్.వెంకటేష్, కోచ్ సీహెచ్ పుల్లయ్య, మేనేజర్ పి.హజరత్తయ్య.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్


సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో ఎంఎం కొండయ్య, టీడీపీ, జనసేన శ్రేణులు

చీరాల, మార్చి 1: రాష్ట్ర ప్రజల భవిష్యత్ సీఎం జగన్ అరాచక, అపరిపక్వ పాలనతో రోజురోజుకు అంధకారంలోకి పోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల బతుకులు బాగుండాలంటే చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రిక అవసరం ఉందన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలతో టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టేబోయే కార్యక్రమాలను వివరించారు. శుక్రవారం కొండయ్య ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు 4,5,6,7 వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. ముందుగా పేరాల కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాల మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు అభివృద్ధికి, అరాచకానికి మధ్య జరిగే పోరుగా భావించాలన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అయిన విజనరీ నాయకుడు చంద్రబాబు సీఎం అయ్యేందుకు టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గజవల్లి శ్రీనివాసరావు, మామిడిపాక ప్రసాద్, నాసిక వీరభద్రయ్య, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, కొమ్మనబోయిన రజని, గూడూరు శివరామప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలి

అద్దంకిటౌన్, మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం 0 నుండి 5 సంవత్సరాల చిన్నారులందరికి చుక్కలు తప్పకుండా వేయించాలని డాక్టర్ ఎన్.నవ్యరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని శింగరకొండపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు 3,812 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సమాదాన కుమార్, పద్మావతి, యేసమ్మ, నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు. పి.సాయిశ్రీచరణ్ కోరారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిపాతగొల్లపాలెం గ్రామంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం వైద్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

చీరాలటౌన్, మార్చి 1: పట్టణంలో పెరిగిన రద్దీను నియంత్రించాలంటే దుకాణదారులు సహకరించాలని వన్‌టౌన్ ఎస్సై వేమన అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్సై సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించారు. ఈక్రమంలో గడియార స్తంభం సెంటర్, కూరగాయల మార్కెట్, క్లాత్ మార్కెట్, రైల్వే స్టేషన్ సెంటర్, బస్టాండ్ ప్రాంతాలలో పర్యటించారు. ఆయా ప్రాంతాల దుకాణ దారులతో మాట్లాడారు. వాహనాలు పార్కింగ్ చేసే వ్యక్తులకు సూచనలు చేశారు.

సంక్షేమ పథకాలతో అర్హులందరికీ ప్రయోజనం

కొత్తపేట(చీరాల), మార్చి 1: సంక్షేమ పథకాలతో అర్హులందరికీ ప్రయోజనం చేకూరుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. కొత్తపేట పంచాయతీ ప్రసాదనగరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమాయూన్ కబీర్, ఏపీఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బలరాంను కలిసిన డీఎస్పీ ప్రసాద్


ఎమ్మెల్యే బలరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ బేతపూడి ప్రసాద్

చీరాల, మార్చి 1: చీరాల డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బేతపూడి ప్రసాద్ శుక్రవారం ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి

వేటపాలెం(చీరాల), మార్చి 1: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పనిచేయాలని డీఏవో వై.రామకృష్ణ అన్నారు. వేటపాలెం మండలం అక్కాయిపాలెం ఆర్బీకేలో శుక్రవారం వీఏఏలు, స్థానిక అధికారులు, వ్యవసాయ సలహా మండలి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2023-24 రబీ పంట కాలానికి సంబంధించి రైతులకు తెలపాల్సిన సమాచారం, అందించాల్సిన సేవలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ ఎఫ్రాయిమ్, ఏవో కాశీవిశ్వనాధ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పల్లప్రోలు శ్రీనివాసరావు, వీఏఏలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మార్టూరు, మార్చి 1: బాల్య వివాహాలను ప్రోత్సహించ వద్దని, అవి జరగకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర కమిషన్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శుక్రవారం మార్టూరు వ్యవసాయమార్కెట్ యార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ, వాటి నిరోధంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు అంగనవాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గ్రామాలలో జరిగే బాల్యవివాహాలపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన ఉండాలన్నారు. ఎంపీపీ భుక్యా శాంతి బాయి మాట్లాడుతూ బాల్యవివాహాలతో బాలికలు చిన్న వయసులోనే అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలో మనందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎంఈవో వస్రాంనాయక్, సీడీపీవోలు సుభద్ర, ఎం.సుధ, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఎంలు రాజా రత్నం, వెంకట్రావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

యద్దనపూడి(మార్టూరు), మార్చి 1: యద్దనపూడి మండలం పోలూరు, శ్యామలవారిపాలెంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ వై.నాగరాజు పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి, ఓటర్లకు ఏర్పాటుచేయాల్సిన వసతులపై బీఎల్‌వోలు, వీఆర్‌వోలు, పీఎస్‌లతో చర్చించారు. ఆయన వెంట ఎంఈవో గోపి, వీఆర్‌వో లు పావని, కాలేషావలి, అశోక్ ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

జాండ్రపేట(చీరాలటౌన్), మార్చి 1: మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం. జాండ్రపేట ఎస్టీ కాలనీకి చెందిన పాములపాటి విజయ్(25), రమాదేవి దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. రోజువారీ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థికపరమైన సమస్యలతో ఇటీవల కుటుంబంలో వివాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పెద్దలు వీరిమధ్య సఖ్యత కుదిర్చి పరిస్థితిని చక్కబెట్టారు. రెండు రోజులుగా మరోమారు వివాదం జరిగి భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన విజయ్ అర్ధరాత్రి ఇంటిముందు చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ముడిరాయి లారీ పట్టివేత

బల్లికురవ, మార్చి 1: పర్మిట్ లేకుండా అక్రమ మార్గంలో తరలిస్తున్న గ్రానైట్ ముడిరాయి లారీని శుక్రవారం మైనింగ్ శాఖ ఆర్ఐ రాజు అదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి ఫ్యాక్టరీలకు తరలివెళుతున్న లారీని నిలుపుదల చేసి తనిఖీ చేయగా పర్మిట్ లేకపోవటంతో ఆర్ఐ అదుపులోకి తీసుకొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేత

అద్దంకి, మార్చి 1: పోగొట్టుకున్న సెల్‌ఫోన్ లను పోలీసులు రి కవరీ చేసి బాధితులకు శుక్రవారం అందజేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. పంగులూరు మండలం చందలూరుకు చెందిన ముప్పనేని వెంకటేశ్వర్లు, బల్లికురవ మండలం గొర్రెపాడుకు చెందిన జి.ఆదిలక్ష్మి 15 రోజుల క్రితం అద్దంకి పట్టణానికి వచ్చిన సమయంలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రెండు సెల్‌ఫోన్‌లను గుర్తించి శుక్రవారం బాధితులకు సీఐ కృష్ణయ్య అందజేశారు. సెల్‌ఫోన్‌ల రికవరీ కోసం కృషిచేసిన కానిస్టేబుల్ ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ అభినందించారు.

ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం

చినగంజాం, మార్చి 1: ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించడమే ఆరోగ్య సురక్ష లక్ష్యమని పెదగంజాం ఎంపీటీసీ వై.తిరుపతిరావు అన్నారు. పెదగంజాం సచివాలయం-2 పరిధిలోని ఆవులదొడ్డిపాలగొల్లపాలెం ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, డాక్టర్ వై.భవాని 456 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్, ఝాన్సీరాణి, ఎస్.బేబి, పొదిలి రాఘవ, చిరంజీవి, ఉల్దారాణి, షేక్ సల్మా, శ్యామ్‌సుందరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పావులూరులో పలు ప్రారంభోత్సవాలు

ఇంకొల్లు, మార్చి 1: మండలంలోని పావులూరులో నిర్మించిన పీఏసీఎస్ భవనం, పెట్రోల్ బంకు, గోడౌన్, సచివాలయం-2 ప్రారంభోత్సవాలు శుక్రవారం జరిగాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యడం బాలాజీ, గాదె మధుసూదన్ రెడ్డి, చైర్మన్ ప్రసాదరెడ్డి, రామకృష్ణారెడ్డి, పులఖండం బద్రిరెడ్డి, వెంకారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, బండారు ప్రభాకర్, ప్రసన్న, ఎంపీపీ బండారు అనూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి


కొమ్మినేనివారిపాలెంలో మాట్లాడుతున్న ఎస్ఐ నాగ శివారెడ్డి

బల్లికురవ, మార్చి 1: ఎలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ నాగశివారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో గ్రామ దర్శినిలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికలలో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వరుస కేసులు నమోదయితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు.

పనిచేయని సర్వర్!

వాహనాల వద్ద గంటల తరబడి ఎదురుచూపులు

ఈనెలలోనూ కందిపప్పు అరకొరే

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : జిల్లాలో రేషన్ పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైనా కార్డుదారులకు అందాల్సిన కందిపప్పు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి జిల్లాకు అరకొరగానే కందిపప్పును సరఫరా చేస్తోంది. జిల్లాకు 590 టన్నుల రేషన్ పప్పు అవసరం కాగా అందుబాటులో కేవలం 15 టన్నులు మాత్రమే ఉండటంతో కందిపప్పు పంపిణీని నిలిపివేశారు. దీంతో శుక్రవారం నుంచి ప్రారంభమైన పంపిణీలో కేవలం బియ్యం, పంచదారను మాత్రమే అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 6,70,571 కార్డులు ఉండగా ఒక్కొక్క కార్డుకు కిలో చొప్పున కందిపప్పు, ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, అర కిలో చక్కెరను అందజేయాల్సి ఉంది. అయితే కందిపప్పు, గోధుమపండి అవసరమైన వరకు అందుబాటులో లేదు. జిల్లాకేంద్రమైన ఒంగోలుతో పాటు పలు ప్రాంతాల్లో సరుకుల పంపిణీకి సర్వర్ ఆటంకంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పంపిణీ ప్రారంభం కావడంతో సర్వర్ డౌన్ అయ్యి పనిచేయక కార్డుదారులు గంటల తరబడి మొబైల్ వాహనాల వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయానికి రాష్ట్రంలో మన జిల్లా 18వ స్థానంలో పంపిణీ ఉందంటే సర్వర్ ఏ విధంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయానికి 22,787 కార్డుదారులకు మాత్రమే సరుకులు అందాయి. అంటే కేవలం 3.39 శాతం మందికే అందాయి.

సజావుగా ఇంటర్ పరీక్షల నిర్వహణకు చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఒంగోలులోని నారాయణ జూనియర్ కళాశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న మొదటి సంవత్సరం పరీక్షలను పరిశీలించారు. అన్ని రూములను పరిశీలించడంతోపాటు సీసీటీవీ కంట్రోలు రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈనెల 20వతేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు అయ్యేంత వరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందన్నారు. అవసరమైన పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ వెంట కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావు ఉన్నారు.

ఏపీటెట్‌కు 63 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 1 : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్)కు శుక్రవారం 63 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. నగరంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఉదయం సెషన్‌కు 393 మందికి 358 మంది హాజరు కాగా 35మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 393 మందికి 365 మంది హాజరు కాగా 28మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ రెండు సెషన్లలో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

చమురు ఉత్పత్తిలో రాష్ట్రానికి వాటా ఇవ్వాలి

● సహజ వనరుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ రాజమోహన్ డిమాండ్



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్, చమురు ఉత్పత్తిలో ఆంధ్ర ప్రజల న్యాయమైన వాటా 50శాతం కేటాయించాలని సహజ వనరుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కృష్ణా, గోదావరి బేసిన్ గ్యాస్ సాధన సమితి, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజమోహన్ మాట్లాడుతూ కాకినాడకు 30 కిలో మీటర్ల దూరంలోని సముద్ర గర్భం నుంచి గత జనవరి 7 నుంచి చమురు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తి విలువ కొన్ని రూ.లక్షల కోట్లకు మించి ఉంటుందన్నారు. ఆంధ్ర రాష్ట్రం తీరంలో ఉన్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్ని మార్చుతుందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో లభ్యమవుతున్న సహజ వాయువులు మన సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌కు తరలిపోతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను ఆయన ఎండగట్టారు. అనంతరం పలు తీర్మాణానాలు చేశారు. సహజవనరుల దోపిడిని అరికట్టాలని, రాష్ట్రంలో లభించే సహజ వనరులను గృహ అవసరాలకు ఉపయోగించాలని, ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో సహజ వనరులను మనకు దక్కే విధంగా పొందుపర్చాలని, కేంద్ర ప్రభుత్వానికి రాయల్టీ ద్వారా వచ్చే ఆదాయంలో 50శాతం ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించాలని, కొనసీమ ప్రాంతంలో ఆయిల్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, ఎం.హరిప్రసాద్, తాటిపర్తి గోపాల్‌రెడ్డి, బి.సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, అయ్యప్పరెడ్డి, దాసరి సుందరం, రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌డీ.సర్దార్, పీవీఆర్.చౌదరి, కొంగర నరసింహం, పేరయ్య, ఆవుల సుబ్రహ్మణ్యం, పీవీ.రమణారెడ్డి, గుమ్మల నరసింహారావు, నల్లూరి క్రాంతి, గాలి సంగీతరావు, ఏఎల్.ప్రసాద్, అంకయ్య, పీవీ.సుబ్బారావు, పిన్నిక శ్రీనివాసరావు, వి.రామ్మోహన్‌రెడ్డి, నరేంద్ర, టి.వెంకటస్వామి, ప్రభాకర్, సలార్ పాల్గొన్నారు.

నేడు ప్రవీణ్‌ప్రకాష్ పర్యటన

ఒంగోలు(విద్య), మార్చి 1: విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన ఒంగోలుకు చేరుకుంటారు. శనివారం చీమకుర్తి మ ండలంలోని పాఠశాలలను సందర్శిస్తారు. దీంతో ఒంగోలు డివిజన్, ముఖ్యంగా మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులను పాఠశాల విద్యా ఆర్‌జేడీ.లింగేశ్వరరెడ్డి, డీఈవో సుభద్రలు అప్రమత్తం చేశారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులన్నింటిని అప్‌డేట్‌గా ఉంచాలని వారు ఆదేశించారు.

గ్రామ కార్యదర్శిపై డీఎల్‌డీవో విచారణ



వివాహధ్రువీకరణ రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉషారాణి

నాగులుప్పలపాడు, మార్చి 1 : ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ కార్యదర్శి తీరుపై సచివాలయ ఉద్యోగులు స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరిబాబు సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరులో అక్రమాలకు పాల్పడినట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు సచివాలయ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డీఎల్‌డీఓ ఉషారాణి ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కార్యదర్శి హరిబాబు, సచివాలయ ఉద్యోగులను ప్రత్యక్షంగా విచారించారు. వివాహధ్రువీకరణ రికార్డులను పరిశీలించగా కొట్టివేతలు గుర్తించి కార్యదర్శిని వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆమె ఆగ్రహించారు. సహఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శి హరిబాబుతో లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు డీఎల్‌డీఓ ఉషారాణి తెలిపారు.

'ఉమ్మడి'కి ఎసరు

తూర్పుగంగవరం గ్రామ తిప్పబీడు భూములపై వైసీపీ నేతల కన్ను

పశువుల మేత కోసం 191 ఎకరాలు కేటాయింపు

అప్పట్లోనే గ్రామంలోని ఏడుగురి పేర్లతో పట్టాలు

సాగులేని బీడు భూమికి సంబంధం లేని వ్యక్తుల

పేర్లను సృష్టించిన ఎఫ్‌పీవోఎల్ఆర్

పట్టాదారులకు సంబంధం లేకుండా భూములు

మ్యూటేషన్‌లో పంపకాలు చేసిన తహసీల్దార్

ఆస్తి విలువ కోట్లపై మాటే..



తిప్పబీడు భూమిలో మేత మేస్తున్న గేదెలు

తాళ్లూరు, మార్చి 1 : పశువుల మేత కోసం దశాబ్దాల క్రితం గ్రామానికి ఉమ్మడిగా కేటాయించిన భూమిని కాసేందుకు అధికార వైసీపీ నేతల యత్నాలు చేస్తున్నారు. కోట్లు విలువ చేసే భూమిని వారసుల ముసుగులో కొట్టేసేందుకు చూస్తున్నారు. బీడు భూమి కావడంతోపాటు ఎవరూ సాగులో లేకపోయినా సరే ఉన్నట్లు చూపిస్తూ ఆన్‌లైన్ చేయించుకోవాలని చూస్తున్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తూర్పుగంగవరం గ్రామంలో పశువుల అవసరాల కోసం నాగంబొట్లపాలెం సర్వేనంబరు 229లో 190.50 ఎకరాల భూమిని వెంకటగిరి రాజుల కాలంలో గ్రామఉమ్మడి భూమిగా కేటాయించారు. ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు గ్రామంలోని ఏడుగురు పెద్దలు జాష్టి హనుమయ్య, పట్టాభి రంగయ్య, గూడా బ్రహ్మారెడ్డి, యత్తపు చిన యల్లారెడ్డి, యత్తపు పెద్దక్క, గూడా లక్ష్మమ్మ, గుజ్జుల పెదనాసరెడ్డిల పేరిట పట్టాలు పంపిణీ చేశారు. ఆ భూమికి గట్టి భద్రత కల్పించి వారి పేర్లను రెవెన్యూ ఎఫ్‌ఎల్ఆర్‌లో కూడా నమోదు చేశారు. ప్రస్తుతం ఆ భూమిలో కొంతభాగం చెరువు, కొంతభాగం సాగర్ కాలువల నిర్మాణాలు జరిగాయి. మరికొంత భాగంలో కుంటలు, గుంటలు ఉండి రాళ్ల రప్పలతో నిండి, ఏపుగా గడ్డి, పలురకాల మొక్కలు పెరిగి ఉన్నాయి. గ్రామస్థులు దశాబ్ధాలకాలంగా ఆ భూమిలోకి పశువులను తోలి మేపుకుంటూ ఉన్నారు. ఆ భూమిలో ఒక్క ఎకరా కూడా సాగులో లేదు.

72 ఎకరాలు ఆ ఐదుగురి పేరుతో..

ఆ ఏడుగురి కుటుంబాల్లో రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు ముందుకొచ్చి ఆ భూమికి తమ పెద్దల పేర్ల పట్టాలు ఉన్నందున తమ పేర్లపై ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని సచివాలయంలో మ్యుటేషన్‌కు పెట్టుకున్నారు. గతంలోని తహసీల్దార్లు ఆ భూమి ఉమ్మడి బీడుగా ఉందని తెలిసి మిన్నకుండిపోయారు. ఆ ఐదుగురు మాత్రం తమకు ఉన్న అధికారం అండతో ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌పై వత్తిడితోపాటు లక్షల్లో ముడుపులు ముట్టజెప్పి ఎఫ్‌పీఎల్ఆర్ రికార్డుల్లో 72 ఎకరాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. యత్తపు లింగమ్మ తొమ్మిది ఎకరాలు, యత్తపు రంగమ్మ తొమ్మిది ఎకరాలు, యత్తపు అల్లూరిరెడ్డి 13.50 ఎకరాలు, యత్తపు యల్లారెడ్డి 13.50 ఎకరాలు, కాసా సామ్రాజ్యం 27 ఎకరాలు మ్యూటేషన్ కోసం ఎఫ్‌పీఓఎల్ఆర్ నమోదు చేయించారు.

మిగతా వారికి చెప్పనే లేదు

ఆర్‌వోఆర్ యాక్ట్ ప్రకారం ఏడుగురు పట్టాహక్కుదారులను పిలవకుండా కొందరికి లబ్ధి చేకూర్చేలా రెవెన్యూ రికార్డుల్లో కేవలం ఐదుగురి పేర్లు నమోదు చేయటంతో మిగిలిన పట్టాదారులు మండిపడుతున్నారు. రెవెన్యూ అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు. అన్యాయంగా ఎఫ్‌పీఓఎల్ఆర్‌లో ఐదుగురి నమోదు చేయించారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఏడు కుటుంబాలకు చెందిన దాదాపు 130మంది సంతానం ఉండగా తహసీల్దార్ ఎవరినీ సంప్రదించకుండా ఐదుగురే సాగులో ఉన్నట్లు భూమి పంచినట్లు రికార్డుల్లో నమోదు చేయటంతో గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. అధికార పార్టీ నేతలు తమకు రాజకీయ పలుకుబడితో గ్రామ ఉమ్మడి భూమిని కాజేసేందుకు యత్నాలు చేస్తూ తప్పుడు రికార్డులు సృష్టించటంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల అవసరాల కోసం భద్రత కోసం పట్టా హక్కు గల ఏడుగురు కుటుంబాలను కాదని తమ ఇష్టానుసారం ఐదుగురి పేర్లను ఎఫ్‌పీవోఎల్ఆర్ చేర్చటం తీవ్ర చర్చనీయాంశమైంది.

> ఊరు ఉమ్మడి బీడును అప్పనంగా కొట్టేసేందుకు కొందరు వైసీపీ వర్గీయులు సిద్ధమైపోయారు. అధికారం చేతిలో ఉంది కదా అన్న ధీమాతో ఏకంగా రూ.కోట్ల విలువైన భూమికి ఎసరుపెట్టారు. వారికి అధికారుల సహకారం కూడా మెండుగా ఉంది. భూముల ధరలు గణనీయంగా పెరగటంతో ఇదే అదనుగా కాజేసేందుకు పన్నాగం పన్నారు. భూముల రక్షణ కోసం ఉన్న పట్టాదారుల కుటుంబీకులు కొందరు, సంబంధం లేని వ్యక్తులు తమకున్న అధికార బలంతోపాటు భారీ స్థాయిలో ముడుపులు ముట్టచెప్పి తమ పేర్లపై ఆన్‌లైన్ చేయించుకునేందుకు చూస్తున్నారు. 130మంది వారసులు ఉండగా కేవలం ఐదుగురు వైసీపీ నేతల పేర్లు ఎఫ్‌పీవోఎల్ఆర్‌లో చేర్చారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందితో సంబంధం లేకుండా మ్యూటేషన్ కోసం ప్రక్రియను చేపట్టడం గమనార్హం.

భూమిలో నుంచి హైవే రోడ్డు..

ఆ భూమి గుండా నేషనల్ హైవే రోడ్డు పడటంతో



ఎఫ్ఎల్ఆర్‌లో ఉన్న ఏడుగురి పేర్లజాబితా

భూముల ధరలు పెరిగాయి. ఎకరా సరాసరిన రూ.5లక్షల మేర ఉందని, గ్రామ ఉమ్మడి భూమి విలువ కోట్లల్లో ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఆ గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఆ భూమి అన్యాక్రాంత కాకుండా చూడాలని పలుమార్లు అధికారులకు విన్నవిస్తు వచ్చారు. అధికార యంత్రాంగం మాత్రం ఎవరి పేరున పట్టాలు ఇవ్వటం కుదని చెబుతూ వచ్చింది. అయితే ఇటీవల బదిలీపై వెళ్లే ముందు తహసీల్దార్ తప్పుడు విధానాలు అవలంబించారని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తిప్పబీడు భూమిని పరిశీలించాలని, సాగులో లేని భూమిని సాగుగా చూపుతూ తప్పుడు విధంగా నమోదు చేసిన పేర్లను రద్దుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పశువు మేత కోసం కేటాయించిన గ్రామ ఉమ్మడి భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఉమ్మడి బీడును కాజేసేందుకు యత్నం

-వల్లభనేని సుబ్బయ్య, తూర్పుగంగవరం

మా గ్రామంలో సర్వే నంబర్ 229లోని 190.50 ఎకరాల భూమిని గ్రామస్థులు పశువుల మేత కోసం వాడుకుంటున్నారు. దశాబ్దాల కాలం క్రితం ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా కేవలం పశువుల మేత కోసం గ్రామంలోని ఏడుగురికి పట్టాలు కూడా పంపిణీ చేశారు. దీనిపై అధికార పార్టీ నేతల కన్నుపడింది. అందులో రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు అధికారులతో లాలూచీపడి ఎఫ్‌పీవోఎల్ఆర్ తప్పుడు విధంగా పేర్లు నమోదు చేసి ఆన్‌లైన్ చేసేందుకు యత్నిస్తున్నారు. ఉమ్మడి భూమిని హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తే గ్రామంలో పశువులకు మేతకు ఇబ్బందే. అధికారులు తమ ఇష్టానుసారం చేస్తే ఇబ్బందులు తప్పవు.

విచారణ చేయించి తగు చర్యలు చేపడతాం

షేక్ మహమ్మద్ హుస్సేన్, తహసీల్దార్

తూర్పుగంగవరంలో సర్వేనంబర్లు 229లోని 190.50 ఎకరాల్లో 72ఎకరాల భూమి మ్యూటేషన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. కొందరు గ్రామస్థులు ఈ విషయమై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు కూడా అందజేశారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో ఆ భూమిని పరిశీలించి, విచారణ చేయించి తగు చర్యలు చేపడతాం.

కొనసాగుతున్న కసరత్తు

లోకేష్ పర్యటన వాయిదా

బాబుతో మాగుంట భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మిగిలిన అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాత పర్యటించాలన్న ఉద్దేశంతో లోకేష్ శంఖారావం కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఆదివారం నుంచి జిల్లాలో ప్రారంభం కావాల్సిన లోకేష్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేసినట్లు అధికారికంగా సమాచారమిచ్చారు. జిల్లాతోపాటు ఆయన పర్యటించనున్న ఇతర జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక ఇంకా ఖరారుకాని విషయం తెలిసిందే. ఆదివారం నుంచి లోకేష్ పర్యటిస్తే మూడు రోజుల్లో ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో సభలు జరగాల్సి ఉంది. అయితే వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలో చేరిక తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఒంగోలు లోక్‌సభలో పర్యటించేటప్పుడు మాగుంటతో పాటు ఆయన కుమారుడు కూడా ఉంటే మంచిదన్న అభిప్రాయానికి అధిష్ఠానం వచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు మాగుంట కూడా సమాచారమిచ్చారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లో చంద్రబాబును మాగుంట కలిసినట్లు కూడా తెలిసింది. ఆయన చెన్నై నుంచి హైదరాబాద్‌కు చేరి బాబును కలిశారని సమాచారం. ప్రధానంగా మాగుంట, అతని అనుచరులు పార్టీలో చేరే తేదీపై మాట్లాడినట్లు సమాచారం. అధినేత చంద్రబాబు శనివారం నుంచి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నందున ఆయనకు అనుకూలమైన తేదీన ఆయన సమక్షంలో మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి, ముఖ్య అనుచరులు పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 6వ తేదీ లేక మరో రోజు మాగుంట చేరేందుకు చంద్రబాబు ప్రోగ్రామ్ ఖరారు చేయనున్నట్లు సమాచారం. అలాగే పశ్చిమప్రాంతంలోని ఒక అసెంబ్లీ స్థానం నుంచి మాగుంటని రంగంలో దించే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. ఆ మేరకు ఉన్నత స్థాయిలో సమాలోచనలు ప్రారంభమయ్యాయి. దీనికితోడు జనసేన పోటీచేసే స్థానాలు అలాగే అభ్యర్థుల ఎంపిక కూడా జరగాల్సి ఉంది. ఇదే సమయంలో బీజేపీతో పొత్తు ఉంటుందా లేదా అన్న అంశం కూడా కొలిక్కిరాకపోవటంతో అన్ని అంశాలపై తుదినిర్ణయం జరిగిన తర్వాత లోకేష్ శంఖారావం సభలను నిర్వహిస్తే బాగుంటుందన్న ఆలోచనకు వచ్చారు. ఆ మేరకు జిల్లాలో లోకేష్ పర్యటన మరో రెండురోజులు తర్వాత ఎప్పుడు ఉండేది తెలియజేస్తామని అధిష్ఠానం జిల్లా నాయకులకు సమాచారమిచ్చింది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మొదటి రోజు 22,834 మంది హాజరు



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), మార్చి 1 : జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షల్లో భాగంగా మొదటి రోజు ఫస్టియర్ ద్వితీయ బాషా పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సాగింది. ఉదయం 8.30 నుంచే విద్యార్థులు కేంద్రాల్లోకి అనుమతించారు. కేంద్రాల ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థులను పరిశీలించి లోపలికి అనుమతించారు. రైటింగ్ ప్యాడ్, హాల్‌టికెట్, పెన్నులు పెట్టుకునే బాక్సును మాత్రమే అనుమతించారు. అన్ని కేంద్రాలను నోఫోన్ జోన్లుగా ప్రకటించిన నేపథ్యంలో పరీక్షల నిర్వహణాధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది సెల్‌పోన్లను కేంద్రాలకు తీసుకెళ్లనివ్వలేదు. అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు అమర్చి గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులతో ప్రత్యేకంగా వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్‌ను విధించడంతోపాటు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జెరాక్స్ సెంటర్లు, కంప్యూటర్ సెంటర్లను మూయించారు.

పరీక్షకు 21,834 మంది హాజరు

మొదటిరోజు పరీక్షకు 21,387 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 20,295 మందికి గాను 19,233 మంది పరీక్షకు హాజరుకాగా 1,062 మంది గైర్హాజరయ్యారని ఆర్‌ఐఓ ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు 2,539 మందికిగాను 2,154 మంది హాజరయ్యారు. మొత్తం 21,834 మందిలో 1,447 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. స్క్వాడ్ అధికారులు, ఆర్ఐఓ, డీఈసీ సభ్యులు 58 పరీక్షా కేంద్రాలను సందర్శించారు.



స్వామి హారతి అందుకుంటున్న విద్యార్థినులు

ఆలయాలు కిటకిట

తమ భవిష్యత్‌ను నిర్ణయించే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లాయర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో అయితే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బాబా పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పరీక్షకు హాజరయ్యారు. నగరంలోని ఇతర ఆలయాల్లో కూడా విద్యార్థులు తమ ఇష్టదైవాలకు ప్రార్థనలు నిర్వహించి పరీక్షకు హాజరయ్యారు.

ఓట్ల మార్పులు, చేర్పుల దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1 : ఓట్ల చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన క్లైయిమ్స్‌లో వారం రోజులు దాటినవి 6200 ఉన్నాయన్నారు. అంతకు ముందు ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికలలో సరైన ఆధారాలు లేని డబ్బు పట్టుబడితే వాటిని అప్పటికప్పుడే సేఫ్ కస్టడీ డిపాజిట్ చేసేలా అన్ని బ్యాంకుల వివరాలను ఈఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలను మరోసారి తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఫొటో గుర్తింపు కార్డులు త్వరగా పంపిణీ, ఎన్నికల సమయంలో సమగ్ర పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కంట్రోలు రూము ఏర్పాటు, జిల్లా నోడల్ ఆఫీసర్ల నియామకం తదితర అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశు వైద్య సహాయకులు అంకితభావంతో పని చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 1: జిల్లాలో పశుసంవర్ధకశాఖ ద్వారా కొత్తగా పశువైద్య సహాయకులుగా ఎంపికైన ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 177 పశువైద్య సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులై మెరిట్ ఆధారంగా ఎంపికైన 174 మందికి శుక్రవారం కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగ నియామక పత్రాలను స్థానిక కలెక్టరేట్‌లో అందజేశారు. ప్రకాశం జిల్లాకు 81, బాపట్లకు 74 మంది, నెల్లూరు జిల్లాకు 19 మందిని కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పశువుల గణాంకాలు సేకరించి రైతులకు అన్ని రకాల సేవలను అందించాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి తదితరులు ఉన్నారు.



పశువైద్య సహాయకులతో కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్





నెల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

కంటైనర్ టెర్మినల్ తరలింపు దారుణం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు
- నెల్లూరు నగరంలో భారీ ప్రదర్శన

నెల్లూరు (వైద్యం)మార్చి 1 : కృష్ణపట్నం నుంచి కంటైనర్ టెర్మినల్ తరలింపు దారుణమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ తరలింపునకు వ్యతిరేకిస్తూ శుక్రవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ నుంచి ఆర్డీసీ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టును ఏర్పాటు చేసింది జిల్లా అభివృద్ధి కోసమేనని, అదానీ అభివృద్ధి కోసం కోసం కాదన్నారు. అదానీ తన నియంత్రణలోని థర్మల్ విద్యుత్ స్టేషన్ అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును బొగ్గు మయంగా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తన పోర్టుల అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును పావుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అదానీ సంస్థ దుష్టపన్నాగాలను నియంత్రించాలన్నారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలు యథావిధిగా సాగేలా చూడాలని డిమాండ్ ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లావాసులకు ఎస్పీ హెచ్చరిక




నెల్లూరు (క్రైం), మార్చి 1 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో ఆదనపు అదనపు ఆదాయం సంపాదించేందుకు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేద్దామనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడు తున్నారని చెప్పారు. క్రిప్టో కరెన్సీ, రిమోట్ యాక్సెస్ ఫ్రాడ్ పేరిట ప్రజలను దోచు కుంటున్నట్లు తెలిపారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా అపరచిత వ్యక్తులు స్నేహితులుగా మారి విదేశాల నుంచి బహుమతులు పంపుతున్నామంటూ నమ్మించి రూ.లక్షలు దోచేస్తున్నారన్నారు. జిల్లాలో ప్రీపెయిడ్ టాస్కుల ఫ్రాడ్ ద్వారా రూ.13 లక్షలు, నకిలీ వెబ్‌సైట్స్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.10 లక్షలు, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్స్, రివ్యూల ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని రూ.9.5 లక్షలు, విమాన టికెట్స్ బుక్‌చేస్తే అధిక నగదు సంపాదించవచ్చని రూ.3.5 లక్షలు చొప్పున సైబర్ నేరగాళ్లు కాజేశారని ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికత ఆధారంగా ఈ కేసులను దర్యాప్తు చేస్తున్నామ న్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు సైబర్‌మిత్ర వాట్సప్ నెం. 9121211100, 1930, ఎన్సీఆర్‌పీ పోర్టల్ సైబర్ క్రైమ్.జీవోవి.ఇన్‌లకు, స్థానిక పోలీ సులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్మీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : భారత ఆర్మీలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో కోరారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయ పరిధిలోని నెల్లూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని అర్హులైన యువకులు ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల నకిశీలన అనంతరం ఏప్రిల్ 22న కామన్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఇంటర్ విద్యార్హతపై అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ (ఆల్‌ఆమ్స్), 8, 10 తరగతుల విద్యార్హతపై అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ (ఆల్ ఆమ్స్) ఉద్యోగాలకు పదిహేడన్నర సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసుగల అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు.

నెల్లూరు వైసీపీ అభ్యర్థిగా విజయసాయి



నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిని ఖరారు చేశారు. శుక్రవారం ఆ పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన 9వ జాబితాలో విజయసాయి పేరు వెలువడింది. కాగా, ముత్తుకూరు మండలం తాళ్లపూడి విజయసాయి స్వగ్రామమైనా ఆయన బాల్యం, విద్యాభ్యాసం అంతా చెన్నైలో సాగింది. ఆడిటర్‌గా జగన్‌కు పరిచయ మైన విజయసాయి ఆ తరువాతి కాలంలో జగన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు ఆర్థిక సలహాదారుగా పని చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ ఆడిటర్‌గా వ్యవహరించారు. తదనంతర కాలంలో వైసీపీలో కీలక నేతగా మారారు. 2016 నుంచి ఇప్పటివరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇదివరకు నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజీనామాతో వైసీపీ పెద్దలు అభ్యర్థి కోసం వెతుకులాడుకోవాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి పేరు ప్రచారంలోకి వచ్చింది. అయితే, అనూహ్యంగా విజయ సాయి రెడ్డి పేరును శుక్రవారం ప్రకటించారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఇద్దరు రాజ్యసభ సభ్యులు పోటీ పడనుండటం విశేషం.

సోమశిలలో 16.438 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శుక్రవారం నాటికి జలాశయంలో 16.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రూపుదిద్దుకున్న సభాప్రాంగణం



ఏర్పాట్లపై టీడీపీ ముఖ్యనాయకుల మంతనాలు

నేడు చంద్రబాబు రాక

- నెల్లూరులో విస్తృత ఏర్పాట్లు
- పసుపుమయంగా మారిన గొలగమూడి రోడ్డు
- వీపీఆర్ దంపతులతోపాటు భారీగా టీడీపీలో చేరనున్న వైసీపీ శ్రేణులు

నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నెల్లూరులో పర్యటించనున్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతోపాటు అధికార వైసీపీకి చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరనున్నారు. ఈ సందర్భంగా గొలగమూడి రహదారిలోని వీపీఆర్ కన్వెన్షన్‌లో భారీ ఏర్పాటు చేశారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూ రు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు శుక్రవారం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **11 గంటలకు చంద్రబాబు రాక**

శనివారం ఉదయం 9.50 గంటలకు చంద్రబాబు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు. 11.50 గంటలకు కనుపర్తిపాడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని, రోడ్డుమార్గాన 12 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు పార్టీలో చేరికలు, సభ ఉంటుంది. అనంతరం 2.30 గంటలకు పల్నాడు జిల్లాకు బయలుదేరుతారు.

భారీగా చేరికలు

వీపీఆర్ దంపతులతోపాటు వైసీపీకి చెందిన పలువురు నాయ కులు టీడీపీలో చేరనున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరనున్నవారిలో ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీల మండల అధ్యక్షులు, కార్పొ రేటర్లు, కౌన్సిలర్లు ఇలా స్థాయి కలిగిన వారు వందల సంఖ్యలో తేలారు. పార్టీలో చేరేవారి జాబితాను టీడీపీ జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మె ల్సీ రాంభూపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహ ణలపై రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర డాక్టర్ల సంఘం అధ్యక్షుడు జెడ్.శివ ప్రసాద్‌లు శుక్రవారం మధ్యాహ్నం వీపీఆర్‌తో భేటీ అయ్యా రు. పార్టీలో చేరేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం, సాయంత్రానికి పల్నా డు జిల్లాలో జరిగే కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కావా ల్సి ఉండటంతో జాబితాను కుదించాలని నిర్ణయించుకున్నారు. వీపీఆర్ దంపతులతోపాటు 50 మంది ముఖ్య నాయకులకు చంద్ర బాబు చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాలని, మిగిలిన వారిని మరో కార్యక్రమం ఏర్పాటు చేసి పార్టీలో చేర్చు కోవాలని నిర్ణయించుకున్నారు.

- **విస్తృత ఏర్పాట్లు**

చంద్రబాబు పాల్గొనే వీపీఆర్ కన్వెన్షన్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కన్వెన్షన్ హాలులో మూడు గ్యాలరీలు ఏర్పాటుచేసి 6వేల మందికిపైగా కూర్చోవడానికి వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరం నుంచి వీపీఆర్ కన్వెన్షన్ వరకు దారిపొడవునా చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి నారాయణ ముఖ్యనాయకులతో సమీక్షించారు. పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి, మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



గొలగమూడి రోడ్డులో వెలసిన ఫ్లెక్సీలు

నెలరోజుల్లోనే జేసీ బదిలీ

నూతన జేసీగా సేతు మాధవన్ • ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవోగా ఆయన్ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జేసీగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సేతు మాధవన్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవోగా పని చేస్తు న్నారు. కాగా జిల్లాలో బాధ్యతలు తీసుకొన్న నెల రోజుల వ్యవధిలోనే ఆదర్శ్ రాజేంద్రన్ బదిలీ కావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతో కొన్ని రోజులుగా ఆయన సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ జేసీగా నెల్లూరు కార్పొరేషన్ కమిష నర్ వికాస్ మర్మత్ వ్యవహరిస్తు న్నారు. నెల రోజుల వ్యవధిలో మూడో జేసీ జిల్లాలో బాధ్యతలు చేపట్టనుండటం గమనార్హం. జనవరి నెలాఖరున రోణంకి కూర్మ నాథ్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో వచ్చిన ఆదర్శ్ రాజేంద్రన్ తాజాగా బదిలీ అయ్యారు.



ప్రమాదం జరిగింది ఈ నౌకలోనే..

అనుకోని ఘటన.. మిగిల్చిన ఆవేదన!

- కృష్ణపట్నం పోర్టులో ఇద్దరు యువకుల మృతి

బొగ్గు నౌకలో ఊపిరాడక దుర్మరణం

బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం

అంతులేని విషాద ఘటన ఇది. 'డ్యూటీకి వెళ్లొస్తానమ్మా..' అని వెళ్లిన తండ్రి శవమై ఇంటికి చేరడంతో ఆ ముగ్గురు ఆడబిడ్డలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మూడేళ్ల క్రితం తల్లిని, ఇప్పుడు తండ్రిని తీసుకెళ్లిపోయావే దేవుడా ఇక తమకు దిక్కెవరంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ ముగ్గుర్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. అలాగే ఆదివారం పెళ్లిపీటల మీద కూర్చోవాల్సిన వరుడు తిరిగిరాని లోకానికి వెళ్లిపోయాడని తెలిసి ఇరుకుటుంబాలు కన్నీటి పర్యంతమయ్యాయి. ఉదయం వరకు పెళ్లిపనుల్లో ఉన్న కుమారుడు సాయంత్రం శవమై ఇంటికి చేరడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన అంతాఇంతా కాదు. శుక్రవారం కృష్ణపట్నం పోర్టులోని ఓ నౌకలో శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు ఊపిరాడక మృత్యువాత పడ్డారు.

ముత్తుకూరు, మార్చి 1 : ముత్తుకూరులోని అరుంధతివాడకు చెందిన కోడూరు కదిరి వేలు (33), ఇందిరమ్మ గిరిజన కాలనీకి చెందిన కవరగిరి యశ్వంత్ (22) అదానీ కృష్ణపట్నం నౌకాశ్రయంలో విధులు నిర్వహిస్తున్నారు. పోర్టులోని బెర్త్ నెం.6లో లంగరు వేసిన రూయినింగ్-21 నౌకలో బొగ్గు అన్‌లోడింగ్ జరిగింది. శుక్రవారం నౌకలోని 6వ నెంబరు హ్యాచ్‌ను శుభ్రం చేయాల్సి ఉంది. అయితే, పొరపాటున కదిరివేలు, యశ్వంత్‌లు 5వ నెంబరు హ్యాచ్‌లోకి దిగారు. మూసి ఉన్న ఈ హ్యాచ్‌లో విషవాయువుల తీవ్రతకు వారిద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పరిస్థితి గమనించిన అక్కడున్న సిబ్బంది వెంటనే వారిద్దరినీ బయటకు తీసుకువచ్చేసరికే ఊపిరాడక మృతి చెందారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ శివనాంచారయ్య తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

- **రేపు పెళ్లి అంతలోనే..**



మృతుడు యశ్వంత్‌కు ఆదివారం పెళ్లి జరగనుంది. సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ సంతోషంగా ఉన్న కుటుంబం విషాదంలో మునిగిపోయింది. శుక్రవా రం ఉదయం 11గంటల వరకు ఎంతో సంతోషంగా ఉన్న కుటుంబ సభ్యులు యశ్వంత్ మృతి విషయం తెలిసి నిర్ఘాంతపోయింది. రెండే రెండు రోజుల్లో పెళ్లి కొడుకుగా పీటల మీద కూర్చోవాల్సిన యశ్వంత్ ఇక లేడు అని తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సరైన నిర్వహణ లేకనే తమ కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

- **ఆడపిల్లలను అనాథలను చేసి...**



మరో మృతుడు కోడూరు కదిరివేలు భార్య సారక్క మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతువాత పడింది. దీంతో తన ముగ్గురు కుమార్తెలు భావన (10), గౌతమి (6), పల్లవి (4)లను అన్నీ తానే పెంచుతున్నాడు. తండ్రి మృతి చెందాడని తెలియడంతో ఆ బాలికలు కన్నీటిపర్యంతమయ్యారు. బోరున విలపిస్తున్న వారిని చూసిన చుట్టుపక్కల వారు సైతం కంటతడి పెట్టుకున్నారు. ప్రస్తుతం వీరికి అమ్మమ్మ, నానమ్మలే దిక్కుగా మారారు. తల్లిదండ్రులు కోల్పోయిన ఆ బాలికల భవిష్యత్తుకు తగిన భద్రత కల్పించాలని పోర్టు యాజమాన్యాన్ని స్థానికులు కోరుతున్నారు.

నెల్లూరు రాజకీయం

ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..

నేను సహకరించను!

- 'బుర్రా'కు తేల్చి చెప్పిన ఎమ్మెల్సీ తూమాటి
- ఇదే విషయం వైసీపీ అధిష్ఠానానికీ చేరవేత



బుర్రా మధుసూదన్



తూమాటి మాధవరావు

కందుకూరు, మార్చి 1 : వైసీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. సహకరించలేనని ఎమ్మెల్యే మహీధరరెడ్డి స్పష్టం చేసిన మరుసటిరోజే ఎమ్మెల్సీ కూడా తాను బుర్రాతో కలిసి పని చేయలేనని పార్టీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం. బుర్రా మధు శుక్రవారం మాధవరావుకు ఫోన్ చేసి కందుకూరు రావాలని ఆహ్వానించగా ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 'గతంలో కనిగిరి నియోజకవర్గానికి నన్ను సీఎం జగన్ పరిశీలకుడిగా నియమిస్తే అడ్డుకోవడమేగాక మా నియోజకవర్గంలో మీ సామాజికవర్గం వారు వస్తే ఇబ్బంది అని చెప్పిన నీకు ఇప్పుడు నా అవసరం వచ్చిందా? నీకు నా సహకారం ఎట్టిపరిస్థితుల్లో ఉండదని మాధవరావు స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. జగన్‌తో సన్నిహిత సంబంధాలున్న ఎమ్మెల్సీ మాధవరావు నుంచి ఈ సమాధానాన్ని ఊహించని బుర్రా 'అదేంటి జగన్ ఆదేశాలు కదా మనమంతా కలిసి పని చేయాలి.' అని అనగానే అప్పట్లో కనిగిరికి తనను పరిశీలకుడిగా నియమించింది కూడా జగనే కదా మరి ఆ రోజు తనను రావద్దని ఎలా చెప్పావని ప్రశ్నించిన ఎమ్మెల్సీ 'నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో నేనైతే సహకరించబోన'ని స్పష్టం చేయడం విశేషం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నుంచి ఒకే సమాధానం రావటమే గాక బుర్రాకు ఇన్చార్జి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కొన్నేళ్లుగా అసంతృప్త కూటమిగా గుర్తింపు పొందిన కొందరు వైసీపీ నేతలు కూడా విజయసాయిని కలిసి బుర్రాను మార్చాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా శుక్రవారం బుర్రా మధుసూదన్ యాదవ్‌ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుర్రాను నాయకులు, కార్యకర్తలతోపాటు కందుకూరు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరిని బుర్రా కలిసి పరిచయం చేసుకున్నారు. సాయంత్రం పట్టణంలోని వైసీపీకి చెందిన ప్రముఖుల నివాసాలకు వెళ్లి వారి మద్దతు కోరారు.

- **గుంభనంగా మహీధరరెడ్డి**

మరోవైపు ఎమ్మెల్యే మహీధరరెడ్డి తన భవిష్యత్తు కార్యాచరణపై గుంభనంగానే వ్యవహరిస్తున్నారు. శుక్రవారం తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేస్తారన్న ఊహాగానాలు వచ్చినా ఎలాంటి సమావేశం జరగలేదు. ఉదయం ఆయన అధికారిక కార్యక్రమాలలో బిజీగా ఉండగా సాయంత్రం కార్యాలయంలో ఉన్న సమయంలో పెద్దసంఖ్యలో ఆయన అనుచరులు, అభిమానులు వచ్చి కలిశారు. మన పయనమెటు అన్న వారి ప్రశ్నలకు ఎలాంటి సంకేతాలు ఇవ్వకపోవటం విశేషం.

తొలిరోజు ప్రశాంతం!

- ఇంటర్ పరీక్షల ప్రారంభం
- 27,220 మందికి 26,374 మంది విద్యార్థుల హాజరు



విజయోస్తు : ఆలయంలో పూజలు చేసుకుంటున్న విద్యార్థులు



ఇదిగో నా నెంబర్ ఇక్కడుంది!

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 1 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 81 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజున ప్రథమ సంవత్సర విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టులను రాశారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవగా తొలిరోజు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు 7.30 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నిర్ణీత గడువు తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించ లేదు. జనరల్ విభాగంలో 25,930 మందికిగాను 25,249 మంది విద్యార్థులు హాజరయ్యారు. 681 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి 1,290 మందికి 1,125 మంది పరీక్ష రాశారు. 165 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 27,220 మందికి 26,374 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

- **అధికారుల పరిశీలన**

ఇంటర్ పరీక్షలను ఆర్ఐవో ఏ శ్రీనివాసులు నగరంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. డీవీఈవో నాలుగు, డీఈసీ సభ్యులు 31 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. తొలిరోజు పరీక్షల్లో ఎవరూ మాల్ ప్రాక్టీసుకు పాల్పడలేదని ఆర్ఐవో తెలిపారు. అలాగే ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి నగరంలోని డీకేడబ్ల్యూ, సర్వోదయ కళాశాలలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద తీసుకున్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 సీఆర్పీసీ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదన్నారు. ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయడానికి తగిన ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీస్ శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా సంబంధిత పోలీసు అధికారులకు తగు సూచనలు చేశామన్నారు.



పదా.. టైం అయిపోతోంది!



కనిగిరిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

- **నేడు సీనియర్లకు..**

ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 81 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా, జనరల్ విభాగంలో 24,243 మంది, వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులు 1414 మంది హాజరు కానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది.



జాగ్రత్తగా ఉండండి : నెల్లూరులో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచనలు



ఆత్మకూరు : రేకుల షెడ్డులో ఫ్యాన్ లేకుండా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ఆత్మకూరు, మార్చి 1: నియోజకవర్గంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1,041 మంది విద్యార్థుల్లో 974 మంది హాజరై 67మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేంద్రాలను సీఐ వేణు పరిశీలించారు.

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 246 మందిలో 231 మంది హాజరయ్యారు.

సీతారామపురం: ఏపీ మోడల్‌స్కూల్‌లో కేంద్రంలో 143మందిలో 139మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వహణ అధికారి మహేష్ తెలిపారు.

సంగం: నాలుగు పరీక్ష కేంద్రాల్లో 222 మంది విద్యార్థులను కేటాయించగా మొదటిరోజు 217 మంది హాజరై, 5 గురు విద్యార్థులు గైర్హజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ ఎస్ సుమతి తెలిపారు.


ఉదయగిరి : విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉదయగిరి రూరల్: ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలను చీఫ్ ఏ.రమణ, కమలహాసన్ పర్యవేక్షించారు. 346 మందిలో 335 మంది హాజరైనట్లు తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ అధికారి షఫీఅహ్మద్ పర్యవేక్షిం చారు. పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి పంపారు.


ఆత్మకూరులో పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్ఐ ముత్యాలరావు


సంగం పరీక్ష హాలుకు వెళ్తున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షల ప్రారంభం

కలిగిరి, మార్చి 1: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పోలీసు సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు. పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసులు తెలిపారు.

పేదల జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి

కావలి, మార్చి 1: పేదల జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి చేస్తానని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి పట్టణం 12వ వార్డులోని అరుంధతీయ వాడలో శుక్రవారం ఏబీఎం సంస్థల అధినేత జీడీడీ దివాకర్ పాల్గొన్న కార్యక్రమంలో వైసీపీ నేత దావులూరి శ్యాంసన్‌తో పాటు ఆయన అనుచరులు, నలుగురు వలంటీర్లు టీడీపీలో చేరారు. అలాగే ముసునూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో 22వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్, మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి దావులూరు దేవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోనేతలు గుత్తి కొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు, అక్కిలగుంట సూరి, బొమ్మా శ్రీనివాసులు పాల్గొన్నారు.


కావలి 12వ వార్డు వైసీపీ నేత శ్యాంసన్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి


కందుకూరు: ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

ఇంటూరి సౌజన్య ప్రచారం

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య రెండవరోజు శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు రెవెన్యూ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, చదలవాడ కొండయ్య, దామా కోటేశ్వరరావు, ఆలా ప్రసాద్, అత్తోట మాల్యాద్రి, గోచిపాతల కొండయ్యపాల్గొన్నారు.

20కుటుంబాలు టీడీపీలో చేరిక

బిట్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీ కుమ్మరవీధికి చెందిన రజక సంఘం అధ్యక్షుడు గుండపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక 20 రజక కుటుంబాలు టీడీపీ ఇన్‌చార్జి కావ్యకృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరినట్లు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కార్య క్రమంలో ఆయనతో పాటు మండల ప్రధాన కార్యదర్శి సుధీర్ బాబు, రఘురామ్‌నాయుడు, మాధవరావు, పిచ్చ య్య తదితరులు ఉన్నారు.

డిజిటల్ క్లాస్‌రూం ప్రారంభం

మర్రిపాడు, మార్చి 1: బ్రాంహ్మణపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూంను శుక్రవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం చాబోలు తిమ్మయ్యకు వైద్య ఖర్చులకు రూ.లక్ష సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

వైద్య శిబిరం..

సీతారామపురం: సీతారామపురం బిట్-2 సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ భాగ్యకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, డాక్టర్ స్వప్న, ఆరోగ్య సిబ్బంది. పంచాయతీ కార్యదర్శి జివన్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఆత్మకూరు, మార్చి1: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ షేక్ ఫజులుల్లా, చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, సీహెచ్ ఆదిశేషయ్య, వల్లభనేని రాజేంద్ర, అల్లారెడ్డి ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల సచివాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు శుక్రవారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి మెమోలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరు మంది ఉద్యోగులను మండల కార్యాలయానికి పిలిపించి మెమోలు అందజేశారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సంజాయిషీ ఇవ్వాలన్నారు.

కలువాయిలో భారీగా టీడీపీలోకి..


కలువాయిలో టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల

కలువాయి, మార్చి 1: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన 100మంది శుక్రవారం వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ కార్యదర్శి గడ్డం కిషోర్‌రెడ్డి, ప్రేమ్ కుమార్ సమక్షంలో టీడీపీ కండువాలు వేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంక టేశ్వర్లు నాయడు, కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

వింజమూరు, మార్చి 1: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ లక్ష సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శుక్రవారం అరుంధతివాడలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గంగపట్ల నాగరాజు, గంగపట్ల వెంగళరావు మాదిగ, మంగళ కిశోర్‌మాదిగ, గంగపట్ల ప్రకాశ్‌మాదిగ, మొద్దు మోహన్‌మాదిగ, గంగపట్ల పోలయ్య, కావలి నవీన్, మొద్దు శ్రీకాంత్‌మాదిగ, బాలాజీ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు సర్వం సిద్ధం

ఉదయగిరి రూరల్, మార్చి 1: ఈనెల 3న ప్రారంభమయ్యే పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వంసిద్ధం చేసినట్లు గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 0-5 ఏళ్లలోపు చిన్నారులు 3,605 మంది ఉన్నారన్నారు. ఆదివారం అనంతరం 4, 5వ తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ కలసపాటి వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి 'ఉండేలా' రాజీనామా

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 1: కొన్ని అనివార్య కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ సొసైటీ చైర్మన్ ఉండేలా గురవారెడ్డి తెలిపారు. శుక్రవారం నందిపాడులోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తనతోపాటు మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి చినవెంగళరెడ్డి, బండకిందపల్లి సర్పంచ్ రమేష్, నందిపాడు ఎంపీటీసీ ఎస్తేరమ్మ, సీనియర్ నాయకులు చుండి రమణారెడ్డిలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

వరికుంటపాడు: మండలంలోని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మాజీ మండల కన్వీనర్ ఆంధ్రా బాలగురవారెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, విరువూరు, తూర్పుకొండారెడ్డిపల్లి సర్పంచులు పాలకొల్లు ఉమామహేశ్వరి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, విరువూరు ఎంపీటీసీ భర్త కాశె రమేష్, మాజీ జేసీఎస్ కన్వీనర్ దుగ్గినేని వెంకటేష్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. శనివారం నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వేమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

వైసీపీ ప్రభుత్వం దోపిడీమయం

అనంతసాగరం, మార్చి 1: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరచి దోపిడి, అవినీతికి తెరలేపినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన అనంతసాగరం బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమైయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి ఎక్కువైందని.. గ్రావెల్, ఇసుక, దోపిడి చేస్తూ ప్రజాసంక్షేమం గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకూరు నాగరాజారెడ్డి, కుడుమల సుదాకర్‌రెడ్డి, అల్లంపాటి రమణారెడ్డి, రాజేష్‌రెడ్డి, గురువారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

ఉదయగిరి: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వలంటీర్లకు సేవరత్న, సేవవజ్ర ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓబులరెడ్డి, తాజుద్దీన్, షేక్ పెదమస్తాన్, మూలె వీరారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం వెంకటంపేట, పాపంపల్లి, నందిపాడు, రెడ్లదిన్నె పంచాయతీల్లో విజయ సంకల్పయాత్ర చేపట్టారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, ఎల్‌పీ మాలకొండారెడ్డి, మండ్ల శ్రీనివాసులు, తుమ్మల వెంగయ్యచౌదరి, సర్పంచ్‌లు సుజాత, ఆదెమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు

మర్రిపాడు, మార్చి 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, సతీమణి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతి కుమారి శుక్రవారం హైదరాబాద్‌లోని చంద్రబా బు నివాసంలో కలిశారు. ఉదయగిరి నియోజ కవర్గంలో జరుగుతున్న తాజా రాజకీయాలపై చర్చించినట్లు మేకపాటి తెలిపారు.



● చంద్రబాబు సభను జయప్రదం చేయండి

ఉదయగిరి: నెల్లూరు నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో శనివారం జరిగే నారా చంద్రబాబునాయుడు సభను జయప్రదం చేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

న్యాక్ కేంద్రాన్ని తరలించవద్దని వినతి

ఉదయగిరి, మార్చి 1: బీసీ బాలుర వసతిగృహంలో నిర్వహిస్తున్న న్యాక్ శిక్షణ కేంద్రాన్ని తరలించవద్దని నిర్వాహకులు లక్కినేని ప్రకాష్‌రావు శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరుపేదలైన చేతివృత్తిదారులకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి రూరల్, మార్చి 1: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ తహీర్‌అలీ హుస్సేనీ (కలీం)కు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందాడు ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

ఉదయగిరి రూరల్: స్థానిక ఎంఈవో కార్యాలయానికి పట్టణంలోని స్టేట్‌పేట ఏబీఎం ఎయిడెడ్ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కినేని అశోక్‌కుమార్ శుక్రవా రం ఎంఈవో షేక్ మస్తాన్‌వలికి బీరువాను అందజేశారు. రికార్డులను భద్రపరిచేందుకు తన తండ్రి లక్కినేని సత్యప్రకాష్ జ్ఞాపకార్థం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు భూపంపిణీ చేయాలి

జలదంకి, మార్చి 1: తిమ్మసముద్రం గ్రామంలో అనర్హులకు భూపంపిణీ చేసేందుకు రెవెన్యూశాఖ సిద్ధమయ్యారని ఆరోపిస్తూ మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు గ్రామస్థులతో కలసి శుక్రవారం డిటి భరత్‌కు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల రెవెన్యూ అధికారులు విచారించి అర్హులకు భూపంపిణీ చేయాలని, లేనిపక్షంలో జిల్లాకలెక్టర్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినోద్ వెంట దివి లోకేష్, కాసు మహేశ్వరరావు, ముబ్బు ప్రసాద్‌లు ఉన్నారు.

హెల్త్ సెంటర్ ప్రారంభం

లింగసముద్రం, మార్చి 1: కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని మాలకొండరాయునిపాలెంలో హెల్త్ సెంటర్ భవనాన్ని, లింగసముద్రంలో డిజిటల్ లైబ్రరీని, పెంట్రాలలో రైతు భరోసా, డిజిటల్ లైబ్రరీ, హెల్త్ సెంటర్, పాలకేంద్రం నూతన భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓయు శేషుబాబు, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ఏఈ హనుమంతరావు, వైద్యాధికారి డా.రమేష్, సర్పంచ్ పులి రాఘవులు మండల వైసీపీ కన్వీనర్ పి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం

ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఇందూల్యాండ్ అనే మల్టీ నేషనల్ కంపెనీ వారు విద్యార్థుల కోసం సుమారు రూ.19 లక్షలతో నిర్మించిన గాల్వనైజ్ షెడ్‌ను ప్రారంభించారు.

రహదారి విస్తరణ ప్రారంభం

కలిగిరి, మార్చి 1: కావలి, దుత్తలూరు, సీతారాంపురం రహదారి విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కావలి మార్గం కలిగిరిలో రహదారి విస్తరణ పనుల ప్రారంభించారు.

ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి

కావలిటౌన్, మార్చి1: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన ఎమ్మార్పీఎస్ అమరవీరులకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నేతలు నివాళులు అర్పించారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీ గౌరవాధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు గేరా జానకి, నేతలు చేవూరు కిరణ్, జీ కొండయ్య, కొణిజేటి రామ్మోహన్, అక్కిలిగుంట యేసు, మహేష్ కత్తి శివయ్య పాల్గొన్నారు.

31 లోపు ఇంటి పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

కావలి, మార్చి1: పట్టణంలోని ఇళ్ల, ఆస్తుల యజమానులు ఈనెల 31 లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విష్ణుతో వేమిరెడ్డి చర్చలు


విష్ణుతో చర్చల అనంతరం బయటికి వస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

అల్లూరు, మార్చి 1: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో మాజీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఏకాంతంగా చర్చించారు. అల్లూరులోని విష్ణు నివాసానికి ఆయన వచ్చి ఆయనతో దాదాపు గంటకుపైగా మాట్లాడారు. వేమిరెడ్డితో భేటీ అనంతరం విష్ణు విలేకరులతో మాట్లాడుతూ వేమిరెడ్డి పోటీచేస్తున్న నేపథ్యంలో తనకు మద్దతు తెలపాలని కోరినట్టు ఆయన వివరించారు. ఇందుకు ఆయన సమాధానంగా తాను కూడా పోటీలో ఉంటున్నందున ఒకే పార్టీలో ఉంటే మద్దతు తప్పకుండా ఉంటుందని, కానీ తాను ఇతర పార్టీ గుర్తుపై పోటీ చేస్తున్నందున మద్దతు తెలిపే అవకాశం లేదని తన అభిప్రాయాన్ని తెలిపానన్నారు.

శంఖారావం సభలను జయప్రదం చేయండి

కందుకూరు, మార్చి 1: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ నిర్వహిస్తున్న శంఖారావం సభలను జయప్రదం చేయాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో కోరారు. 3వ తేదీ నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రారంభమవుతున్న శంఖారావం సభలలో యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టాంపు వెండర్లు లేఖరులుగా వ్యవహరిస్తే చర్యలు


స్టాంపు వెండర్లను విచారిస్తున్న జిల్లా రిజిస్ట్రారు

అల్లూరు, మార్చి 1: స్టాంపు వెండర్లు దస్తావేజు లేఖరులుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, అదేవిధంగా స్టాంపు వెండర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే నాన్ జుడీషియల్ స్టాంపులను విక్రయించాలని, ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తానని హెచ్చరించారు. స్టాంప వెండర్లు దస్తావేజు లేఖరులుగా వ్యవహరిస్తున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సులు పొందిన వెండర్లకు దస్తావేజులు రాసే అధికారం లేదని, స్టాంపులు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు.

నాణ్యమైన వస్తువులు వినియోగించాలి

కావలి రూరల్, మార్చి1: ప్రతిఒక్కరూ నాణ్యమైన వస్తువులను మాత్రమే వినియోగించాలని ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అబ్జర్వర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. కావలి పట్టణ ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవో ఎవి క్రిష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నాణ్యమైన వస్తువుల కొనుగోలు, వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ఉలవపాడు, మార్చి 1: జగనన్న కాలనీల పేరుతో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పట్టాలు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండంలోని 1624 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను ఎంపీడీవో విజయ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ డీటీ వీరయ్యలు అందచేశారు.

పాపాయకుంట ఆక్రమణపై సర్వే

ఉలవపాడు: పాపాయకుంట ఆక్రమణకు గురైందని స్థానికుడు మహంకాళి వెంకటేశ్వర్లు లోకాయుక్తలో కేసు నమోదు చేశాడు. దీనిలో భాగంగా పోలేరమ్మ గుడి కుంట పోరం బోకు స్థలంలో నిర్మించారని పేర్కొనడంతో శుక్రవారం లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ గంగరాజు ఫిర్యాదుదారుడి సమక్షంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావుతో సర్వే చేయించారు. పోలేరమ్మ గుడి నిర్మాణం గ్రామ కంఠంలో ఉందని పాపాయకుంటకు సంబంధం లేదని సర్వేయర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, మార్చి 1: మండలంలోని పెదపవని గ్రామంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుడ్లూరు సీఐ జి సుబ్బారావు, లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు సిబ్బంది దాడి చేసి పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని, వారి నుండి రూ.18,500, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాజీబాబు చెప్పారు.

చోరీ కేసులో హిజ్రాల అరెస్టు

కావలి రూరల్: పాతూరుకు చెందిన టైలర్ పొదలకూరు శ్రీనివాసులు మెడలోని బంగారు గొలుసు గురువారం సాయంత్రం దొంగిలించిన ఇద్దరు హిజ్రాలను శుక్రవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారు గొలుసు స్వాధీనం చేసుకు న్నట్లు 1వ పట్టణ సిఐ రాజేష్ తెలిపారు. బట్టలు కుట్టించుకునేందుకని టైలర్ వద్దకు వెళ్లిన హిజ్రాలు ఒకరు గేటు వద్ద ఉండగా మరొకరు షాపులోకి వెళ్లి బాధితుడి మెడలోని బంగారు చైను దొంగిలించుకు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. దీంతో సిఐ సిబ్బందితో కలసి పట్టణంలోని హిజ్రాలను విచారించి ఉదయగిరికి చెందిన కోనేటి అశోక్ అలియాస్ అక్షిత, ఇందుకూరు పేటలోని మైపాడు అక్కయ్యగారి బాలు అలియాస్ భాను అను హిజ్రాలను గుర్తించి అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

కొండాపురం, మార్చి 1: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు కే రవికుమార్, ఆనందరావు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు సచివాలయం, నెట్‌సెంటర్లలో మార్చి 14 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 1: 2024- 25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 3వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

లింగసముద్రం, మార్చి 1: తిమ్మారెడ్డి పాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు వలేటివారి పాలెం గ్రామానికి చెందిన కొల్లు కిషోర్‌బాబు అనే యువ కుడు పరీక్షల సామాగ్రి అందజేశారు. శుక్రవారం మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హష్మార్‌తో కలిసి ఆయన ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న 50 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

6న సీజ్ చేసిన వాహనాల వేలం

కందుకూరు, మార్చి 1: రవాణా శాఖ తనిఖీలలో సీజ్ చేసిన మోటారు సైకిళ్లు, ఇతర వాహనాలకు ఈనెల 6న స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఎంవీఐ షేక్ మహ్మద్ రఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హోరాహోరీగా రైల్వే డివిజనల్ క్రికెట్ పోటీలు

బిట్రగుంట, మార్చి 1: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ డివిజనల్‌స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. స్థానిక బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ పర్యవేక్షణలో రెండు క్రీడామైదానాలలో మూడు జట్లు పోటీపడ్డాయి. నెల్లూరు ఎస్ఎన్‌టీ డిపార్ట్‌మెంట్‌పై పడుగుపాడు ఇంజినీరింగ్ విభాగం గెలుపొందింది. బిట్రగుంట ఎస్ఎస్ మీనా జట్టుపై గూడూరు ఆర్పీఎఫ్ టీమ్ విజయం సాధించింది. బిట్రగుంట హోమ్ టీమ్‌పై నెల్లూరు టీఆర్డీ జట్టు గెలుపొందగా, కావలి ఇంజనీరింగ్ జట్టు, బిట్రగుంట టీఎంఆర్ జట్లు రాకపోవడంతో పోటీని వాయిదా వేశారు.